

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 11.08.2025 | సంపుటి : 2 | సంచిక :189 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Monday | 11.08.2025 | volume : 2 | Issue : 189 | Pages : 8 | Cost : 2/-



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## తుమ్మిడిహెట్టి
# కట్టి తీరతాం

### త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

- ఇచ్ఛంపల్లి నుంచే నదుల అనుసంధానం
- కేంద్రానికి ప్రతిపాదనలు చేశాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- భూసేకరణకు నిధులు ఇస్తాం: భట్టి
- 'జవహర్ ఎత్తిపోతల'కు శంకుస్థాపన



తెలంగాణకు నష్టం కల్గించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫిర్యాదుతో బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును కట్టి తీరుతామని.. పనులు ప్రారంభించబోతున్నామన్నారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టును ఆదివారం వారు సందర్శించి సమీక్షించారు.

**మహబూబాబాద్, ఆగస్టు 10 :**
అంతకుముందు ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడు గ్రామ సమీపంలోని వైరా నదిపై రూ.630 కోట్లతో నిర్మించనున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి బహిరంగ సభలో మాట్లాడారు. రాయలసీమ ఎత్తిపోతల ద్వారా ఏపీ ప్రభుత్వం రోజుకు 11 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం జలాశయం ఖాళీ అవుతుందని, దీనివల్ల నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భద్రాచలం డివిజన్‌లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కకు పెట్టాలని నాడు సోనియాగాంధీకి విజ్ఞప్తి చేయగా పునర్విభజన చట్టంలోంచి ఆ ఏడు మండలాలను మినహాయించారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి తో కలిసి దొంగచాటుగా ఆర్డినెన్స్ తెచ్చాయని... గిరిజనుల రెండు లక్షల ఎకరాలను పోలవరానికి ధారాదత్తం చేశారని భట్టి ఆరోపించారు. నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ నిర్లక్ష్యం,

మిగతా 2 లో



## ముంపు సమస్యకు
# శాశ్వత పరిష్కారం

- భారీ ట్రంకు లైన్లతో వరద ముప్పును తప్పించండి
- గంగుబాయి బస్తీ కుంటను పునరుద్ధరించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- అమీర్‌పేట ప్రాంతంలో ఆకస్మిక పర్యటన

**హైదరాబాద్, ఆగస్టు 10 :**
రాజధాని నగరంలోని బస్తీల్లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటుచేసి ఈ సమస్యను పరిష్కరించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి భారీ వర్షాలకు నగరంలోని పలు కాలనీలు, ప్రాంతాల్లోకి వరద రావడం, ఇళ్లలోకి నీరు చేరిన నేపథ్యంలో.. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. అమీర్‌పేట ప్రాంతంలోని మైత్రీవనం, గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్, బల్కంపేటలోని బస్తీలను పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ముంపు సమస్య ఎన్నేళ్లుగా ఉంది, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటనేది నేరుగా బస్తీవాసులను ఆరా తీశారు. కాగా, బల్కంపేట నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి అడ్డుగా కొన్ని ఇళ్లను నిర్మించడం వల్ల సమస్య వస్తోందని అధికారులు సీఎం వివరించారు.

02





## 13 నుంచి
# అతి భారీ వర్షాలు

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలుండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి.

02



ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక..
**'మేక్ ఇన్ ఇండియా' : ప్రధాని మోదీ**

03



03

మేమే బాస్ అనుకునేవాళ్లకు
## భారత్ వృద్ధి నచ్చలేదు
కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్



03

ఉగ్రవాదులను చుట్టుముట్టిన సైన్యం




## 'జీఎస్టీ' వృద్ధిరేటు
# 3 శాతమే
### 13వ స్థానంలో తెలంగాణ
### కేంద్ర ఆర్థికశాఖ నివేదిక వెల్లడి

03

## కాంగ్రెస్‌కు అవినీతి
# గనిగా సింగరేణి

**దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తాం : ఎమ్మెల్సీ కవిత**

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి సింగరేణి గనిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి దసరా తర్వాత సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్‌ఎంఎస్ కలిసి పనిచేయాలని నిర్ణయించాయి.

03



## ఆర్టీసీకి రూ.33.40 కోట్ల ఆదాయం
### ఒక్కరోజులోనే 66 లక్షల మంది ప్రయాణం

రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెళ్లు.. కట్టించుకునేందుకు అన్నదమ్ములు లక్షల సంఖ్యలో ప్రజారవాణా సంస్థ బస్సులను వినియోగించుకున్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66.39 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళల 'జీరో' టికెట్లే ఏకంగా 45.61 లక్షలు జారీ అయ్యాయి. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా సంస్థకు రూ.33.40 కోట్ల ఆదాయం వచ్చింది.

03



# ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- భారీ ట్రంకు లైన్లతో వరద ముప్పును తప్పించండి
- గంగుబాయి బస్తీ కుంటను పునరుద్ధరించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- అమీర్‌పేట ప్రాంతంలో ఆకస్మిక పర్యటన



**హైదరాబాద్, ఆగస్టు 10 :** హైదరాబాద్ నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. భారీ ట్రంక్ లైన్లు నిర్మించి అమీర్‌పేట వరద ముంపు సమస్యను పరిష్కరించాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. భూగర్భ వరద లైన్ల సామర్థ్యాన్ని పెంచాలని, మురుగునీటి పైపులైన్ల వ్యవస్థను పునరుద్ధరించి బస్తీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వెంటనే ప్రణాళిక రూపొందించి, పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, మధురానగర్ నుంచి వచ్చే వరద.. రోడ్లను, మైత్రివనం కూడలిని, బస్తీలను ముంచెత్తకుండా.. నీరంతా భూగర్భ మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వరద నీటికి తగ్గట్టుగా నాలాలు లేక దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య పరిష్కారానికి వెంటనే అవసరమైన చర్యలు ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లను ఆదేశించారు. గత కొన్ని రోజులుగా మైత్రివనం వద్ద నడుములోతు వరద నిలవటం... కార్లు, బస్సులు అందులో చిక్కుకుపోవడం... శనివారం నాటి వానతో మైత్రివనం వెనుక ఉన్న బస్తీలు నీట మునగడంతో సీఎం నేరుగా రంగంలోకి దిగారు. బుద్ధనగర్, శ్రీనివాసనగర్, గంగుబాయి బస్తీ, గాయత్రినగర్‌లతో పాటు మైత్రివనం ప్రధాన రహదారిని పురపాలకశాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, కార్పొరేటర్ సరళ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం 4 గంటలకు పరిశీలించారు. కాలనీలు తరచూ ఎందుకు మునుగుతున్నాయని అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ట్రంక్ లైన్లు వేసి వరదను పరిష్కరించే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

### కుంట ఆక్రమణపై స్థానికుల ఫిర్యాదు

గంగుబాయిబస్తీ కుంట ఆక్రమణపై ముఖ్యమంత్రికి స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలో అక్కడ కుంట ఉండేదని, వరద నీరు అందులో నిలిచేదని, ఇప్పుడు ఆ ప్రాంతాన్ని మట్టితో నింపి, పార్కింగ్ కేంద్రంగా మార్చారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ కుంటను అంబర్‌పేటలోని బతుకమ్మకుంట మాదిరిగా పునరుద్ధరించాలని, వరద సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కుంట అందుబాటులోకి వస్తే.. భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. బుద్ధనగర్‌లో కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ ఎత్తులో ఉండటం కూడా వరద తీవ్రతకు కారణమని స్థానికులు తెలపడంతో ఆ ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.




## 'జీఎస్టీ' వృద్ధిరేటు 3 శాతమే

### 13వ స్థానంలో తెలంగాణ
### కేంద్ర ఆర్థికశాఖ నివేదిక వెల్లడి

**హైదరాబాద్:** జీఎస్టీ వసూళ్ల వృద్ధిరేటులో తెలంగాణ దేశంలో 13వ స్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి 4 నెలల్లో (ఏప్రిల్–జులై) రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు రూ.14,561 కోట్లకు చేరాయి. గతఏడాది ఇదే వ్యవధిలో వసూలైన రూ.14,203 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 3% మాత్రమే వృద్ధిరేటు నమోదైనట్లు కేంద్ర ఆర్థికశాఖ తాజా నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు వృద్ధిరేటు 4% కాగా.. దేశంలో అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాలు 21 శాతంతో తొలిస్థానంలో నిలిచాయి.

### ఏడాది లక్ష్యం రూ.59,704 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (వచ్చే మార్చికల్లా) రాష్ట్రంలో రూ.59,704 కోట్ల జీఎస్టీ వసూళ్లు సాధించాలన్నది లక్ష్యం కాగా పన్ను వసూళ్లలో లోపాలను, అక్రమాలను అరికట్టి ఆదాయం పెంచాలని మంత్రివర్గ ఉపసంఘం అన్ని శాఖలను ఇటీవల ఆదేశించింది. వృద్ధిరేటు తక్కువగా ఉన్నప్పటికీ పలు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు మాత్రం మెరుగ్గా ఉన్నాయని.. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్ల విధానం పారదర్శకంగా ఉందని వాణిజ్యపన్నులశాఖ అధికారులు చెబుతున్నారు. 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)' పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న సంస్థలపై శాఖ ప్రత్యేక దృష్టి సారించినందునే 3% పెరుగుదల నమోదైనట్లు పేర్కొంటున్నారు. కాగా ఈ ఏడాది జీఎస్టీ వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలంటే నెలనెలా కనీసం 8–10 శాతం వృద్ధిరేటు నమోదు కావాలి.

### వ్యాట్ రూ.2,987 కోట్లు..

పెట్రోల్, డీజిల్, మద్యం అమ్మకాలపై విడిగా వ్యాట్ వసూళ్లు గత నెలలో రూ.2,987 కోట్లకు చేరాయి. గత 4 నెలల్లో రూ.10,453 కోట్లు వసూలు కాగా.. ఈ ఏడాదిలో రూ.37,464 కోట్ల వరకూ సాధించవచ్చని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నిర్మాణ తదితర రంగాల్లో క్రయవిక్రయాలు కాస్త మందకొడిగా ఉంటాయని, క్రమంగా పుంజుకుంటాయని అధికారులు వివరించారు. ఐటీ రంగంలో ఉద్యోగాల్లో కోత వంటివి కూడా కొనుగోళ్లపై ప్రభావం చూపుతున్నాయని వాణిజ్యపన్నులశాఖ చెబుతోంది. వృద్ధిరేటు పెంచడానికి ఏంచేయాలనే విషయమై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం అన్నిశాఖల ఉన్నతాధికారులతో అధ్యయనం చేస్తోంది. కనీసం 10% వృద్ధి సాధించడానికి ఏంచేయాలో చెప్పాలని అన్నిశాఖల నుంచి సలహాలు కోరింది. పన్నులు పెంచకుండా రాష్ట్ర ఆదాయం పెంచాలనే కోణంలో ఉపసంఘం దృష్టి సారించింది.

# తుమ్మిడిహెట్టి కట్టి తీరతాం

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిందని.. ఆ పార్టీ నాయకులు దీన్ని వక్రీకరించి న్యాయవ్యవస్థను అవమానపరిచేలా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ అన్నారు.

### దేవాదులపై త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష

దేవాదుల ప్రాజెక్టు మూడో ఫేజ్‌లో పనులు చేపట్టాల్సి ఉందని.. 2800 ఎకరాలు సేకరించాలని..రూ.67 కోట్ల పరిహారం, రూ.179 కోట్ల బిల్లుల బకాయిలున్నట్లు అధికారులు మంత్రుల దృష్టి తెచ్చారు. అసంపూర్తి పనుల గురించి ఎమ్మెల్యేలు ప్రస్తావించగా.. వాటిపై మూడు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని.. పది రోజుల్లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిద్దామన్నారు. దేవాదుల పనులు పూర్తి చేయటానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బిల్లుల విడుదలపై మంత్రులు హామీ ఇచ్చారు. ప్రారంభ సమయంలో దేవాదుల 38.16 టీఎంసీలతో 5.57 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని.. కానీ పది జిల్లాల్లోని 17 నియోజకవర్గాల్లో పది లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో నీటి కేటాయింపులు 38.16 టీఎంసీల నుంచి 75–80 టీఎంసీలకు పెరగాల్సి ఉందన్నారు. ఈ మేరకు సీడబ్ల్యూసీకి నివేదించామన్నారు. సమ్మక్కసాగర్ బ్యారేజీ నుంచి నీటిని తీసుకునేలా అనుమతులు పొందాల్సి ఉందన్నారు.

ఇచ్చంపల్లి పూర్తికి నిధులివ్వాలని.. గోదావరి–కావేరి నదుల అనుసంధానానికి సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు, దీనిని సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొంతుమాధవరెడ్డి, మురళీనాయక్, రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు అవినీతి గనిగా సింగరేణి

### దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తాం : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, ఆగస్టు 10 :** కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి సింగరేణి గనిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి దసరా తర్వాత సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్‌ఎంఎస్ కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడారు.. 'కేసీఆర్ కృషితోనే సింగరేణి దాదాపు 40 వేల మంది ఉద్యోగులతో కళకళలాడుతోంది. సగటున ఒక్కో కార్మికుడు రోజుకు రూ.30 వేలను ప్రభుత్వానికి సంపాదించి పెడుతున్నారు. వారి జీతంపై ప్రధాని మోదీ ఆదాయపు పన్ను కూడా విధిస్తున్నారు. ఇకనైనా ఆ పన్ను రద్దు చేయాలి. 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైలెవల్ కమిటీ సిఫార్సుల మేరకు వేతనాలు ఇవ్వాలి. దసరాకు బోనస్‌గా లాభాల్లో 37% వాటా ఇవ్వాలి' అని కవిత డిమాండ్ చేశారు. భారత రాష్ట్ర సమితి అంతర్గత వ్యవహారం గురించి విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ 'కాంగ్రెస్‌లో సీఎం ఒక మాట మాట్లాడితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దానికి ఖండన ఇస్తారు. భాజపాలో బండి సంజయ్‌కు ఈటల రాజేందర్ వార్నింగ్ ఇస్తారు. అన్ని పార్టీల్లో ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. భారత రాష్ట్ర సమితిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం లేదు' అని పేర్కొన్నారు.

# కలిసి ఉద్యమిస్తే బీసీనే సీఎం అవుతారు

- కులవృత్తులను కాపాడుకోవడానికి దీర్ఘకాలిక ప్రణాళిక
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 10 :** 'దక్షిణాదిన ఇతర రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే అది జరగలేదు. గౌడ్‌లు, ఇతర బీసీ సామాజికవర్గాలు కలిసి ఉద్యమిస్తే కచ్చితంగా రాష్ట్రానికి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారు' అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్దార్ పాపన్న మహరాజ్ ధర్మపరిపాలన సంస్థ (ఎస్‌పీడీపీఎ), జైగౌడ్ ఉద్యమం–జాతీయ కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వారోత్సవాలు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం ప్రారంభమయ్యాయి. జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డా.వట్టికూటి రామారావు గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.. 'సర్దార్ పాపన్న స్ఫూర్తితోనే మేం రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నాం. ఓ కూడలిలో పాపన్న విగ్రహం ప్రతిష్ఠించుకుందాం. ఇటీవల హైదరాబాద్‌లో కల్తీ కల్లుతాగి 14 మంది చనిపోయారు. కొన్నిసార్లు తప్పులు అంగీకరించాల్సిందే. కల్లు దుకాణాలు మూసేయాలన్నప్పుడు నేను, మంత్రి పొన్నం కలిసి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడాం. కల్లుగీత వృత్తి కొనసాగడానికి చెట్లు పెంచేలా దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరాం' అని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'కులపరమైన సంక్షేమం కోసం పార్టీలకతీతంగా పోరాడదాం. ప్రస్తుతం నర్సరీల్లో 40 లక్షల ఈత మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాల్లో వాటిని నాటుకుందామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయండి' అని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 'కూకట్‌పల్లిలో కల్లు తాగి 14 మంది మరణించడం వెనుక.. కల్లు దుకాణాలను బంద్ చేయించే కుట్ర ఉంది' అని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్, మాజీ ఎంపీ మార్గాని భరత్, కర్ణాటక ఎమ్మెల్సీ జగదేవ్ గుత్తేదార్, గౌడ సంఘాల ఐకాస ఛైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధు సత్యం గౌడ్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## గొప్ప సంస్కరణవాది శివశంకర్

### త్వరలోనే ఆయన విగ్రహం ఏర్పాటు : భట్టి

**హైదరాబాద్ :** చిత్తశుద్ధితో కృషిచేస్తే పేదరికం, వెనుకబాటుతనం అడ్డుకాదని నిరూపించి, స్వయంకృషితో ఉన్నత శిఖరాలు చేరుకున్న స్ఫూర్తిప్రదాత పుంజాల శివశంకర్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆయన గొప్ప సంస్కరణవాది అని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ 96వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివశంకర్ కుమారుడు డాక్టర్ వినయ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా భట్టి మాట్లాడారు.. నగరంలోని ఒక గౌరవప్రదమైన చోట శివశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడి, త్వరలోనే ప్రకటిస్తామన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. శివశంకర్ పుణ్యమా అని జస్టిస్ రామస్వామి వంటి ఎంతోమంది బలహీనవర్గాలవారు హైకోర్టు న్యాయమూర్తులయ్యారని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు మాట్లాడుతూ..శివశంకర్‌లాంటి పెద్దలు కోరుకున్న కల బీసీ రిజర్వేషన్లని.. రాహుల్‌గాంధీ చేయూతతో దేశంలో ఓబీసీల వాటా కోసం ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. నవతరానికి శివశంకర్ జీవితాన్ని పరిచయం చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు కేశవరావు, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, మధుయాస్కీ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

## 13 నుంచి అతి భారీ వర్షాలు



**హైదరాబాద్:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలుండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి.

### నేడు, రేపు భారీ వానలు

సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడనున్నాయి. ఆదివారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 11.05 సెంటీమీటర్లు, సూర్యాపేట జిల్లా ఫణిగిరిలో 8.93, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 7.28, వరంగల్ జిల్లా దుగ్గొండిలో 6.70 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌తో పాటు నారాయణపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి జిల్లాల్లోనూ అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి.

## ఆర్టీసీకి రూ.33.40 కోట్ల ఆదాయం

### ఒక్కరోజులోనే 66 లక్షల మంది ప్రయాణం





**హైదరాబాద్:** రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెళ్లు.. కట్టించుకునేందుకు అన్నదమ్ములు లక్షల సంఖ్యలో ప్రజారవాణా సంస్థ బస్సులను వినియోగించుకున్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66.39 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళల 'జీరో' టికెట్లే ఏకంగా 45.61 లక్షలు జారీ అయ్యాయి. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా సంస్థకు రూ.33.40 కోట్ల ఆదాయం వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ రోజుల్లో 55–57 లక్షల మంది ప్రయాణికులతో 95% సీట్ల భర్తీ నిష్పత్తి(ఓఆర్) ఉంటుండగా.. రాఖీ పండగ రోజున 66 లక్షల మందితో 122% ఓఆర్ నమోదైంది. గతంలో మహిళలు రాఖీపౌర్ణమి రోజున ఆర్టీసీ బస్సు, ఆటో, జీపు, కారు.. ఏది దొరికితే అందులో వెళ్లేవారు. ఈ ఏడాది మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకంతో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించారు. జిల్లాల్లో సరిపోకపోవడంతో సిటీ బస్సులను పెద్దసంఖ్యలో పంపించారు. శనివారం ఊళ్లకు వెళ్లిన మహిళల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

## భారత రాష్ట్ర సమితి సున్నా.. మేమే ప్రత్యామ్నాయం

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్:** రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పని సున్నా అయ్యిందని, తెలంగాణలో భాజపా ప్రత్యామ్నాయంగా మారుతోందని, కమలం పార్టీ 'గేట్ వే ఆఫ్ తెలంగాణ' కానుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో అచ్చంపేట మాజీ శాసనసభ్యుడు గువ్వల బాలరాజు భాజపాలో చేరిన సందర్భంగా రామచందర్‌రావు ఆయనకు పార్టీ కండువా కప్పి, ప్రాథమిక సభ్యత్వం ఇచ్చారు. అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ.. "భాజపా తెలంగాణలో సున్నా అయ్యిందని ఒకప్పుడు భారత రాష్ట్ర సమితి ఎద్దేవా చేసింది. కానీ గత లోక్‌సభ ఎన్నికల్లో కమలం 35 శాతానికి పైగా ఓట్లు సాధించి, 8 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకొంది. దాంతో భారత రాష్ట్ర సమితి పని తెలంగాణలో సున్నా అయ్యింది. ఈ మధ్య 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్' అని అంటున్నారు. కానీ భాజపా త్వరలో 'గేట్ వే ఆఫ్ తెలంగాణ' కానుంది. రాహుల్‌గాంధీ నకిలీ ఓట్లు, ఓట్ల చోరీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు నకిలీ ఓట్లు గుర్తుకురాలేదా? మహారాష్ట్ర, హరియాణాలో ఓడిపోయాక.. త్వరలో బిహార్‌లో ఓడిపోతారని తెలిశాక నకిలీ ఓట్ల ప్రచారం మొదలుపెట్టారు. రాహుల్ ఫేక్ ఇండియన్, ఆయనకు ఫేక్ ఓట్ల గురించి మాట్లాడే అధికారం లేదు. భారీ వర్షాలతో రాష్ట్రం అస్తవ్యస్తమవుతున్నా పట్టించుకోకుండా ముఖ్యమంత్రి పదే పదే దిల్లీకి వెళుతున్నారు" అని విమర్శించారు. గువ్వల బాలరాజు అచ్చంపేట నుంచి రెండుసార్లు శాసనసభ్యుడిగా గెలిచారని, భాజపాను బలోపేతం చేయడానికి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలు తెలంగాణలో ప్రజలను మోసం చేస్తున్నాయని, వీటిపై భాజపా గట్టి పోరాటం చేస్తుండడం నచ్చి ఈ పార్టీలో చేరానని చెప్పారు. అనంతరం అచ్చంపేటకు చెందిన పలువురు నేతలు భాజపాలో చేరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, భాజపా నేతలు పాల్గొన్నారు.



## 'సాగర్' నుంచి 64,800 క్యూసెక్కుల నీటి విడుదల

**నాగార్జునసాగర్ :** నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి రాక పెరగడంతో ఎనిమిది గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎన్నెస్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయానికి శ్రీశైలం నుంచి 65,842 క్యూసెక్కుల వరద రావడంతో సాగర్‌లో ఎనిమిది గేట్లను ఐదడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కుడి కాల్వ ద్వారా 6,465 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518... ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా 29,394... ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800... వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,10,277 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నీటి మట్టం 590 అడుగులకు చేరింది. జలాశయంలో 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## భవిష్యత్తు విదేశాంగ మంత్రి
# అనుకుంటే.. అరెస్ట్



**చైనా :** చైనాలో కీలక నాయకుల అరెస్టుల పరంపర కొనసాగుతోంది. భవిష్యత్తులో మంత్రి పదవి చేపడతారనుకొన్న ఓ దౌత్యవేత్త ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నారు. లియు జియాంచావ్ అనే సీనియర్ దౌత్యవేత్తను అధికారులు అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆదివారం కథనం ప్రచురించింది. లియు భవిష్యత్తులో విదేశాంగ మంత్రి పదవి చేపట్టొచ్చని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది జులైలో లియు ఓ విదేశీ పర్యటన ముగించుకొని బీజింగ్ తిరిగి రాగానే అధికారులు ఆయన్ను బంధించినట్లు వాల్‌స్ట్రీట్ వెల్లడించింది. తాజాగా ఈ అంశంపై స్టేట్ కౌన్సిల్ ఇన్ఫర్మేషన్ ఆఫీస్ వెంటనే ఎటువంటి కామెంట్ చేయలేదు. 61 ఏళ్ల లియు కమ్యూనిస్టు పార్టీ విదేశీ రాజకీయ పక్షాలతో సంబంధాలు నిర్వహించే సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన 2022లో ఈ పదవి చేపట్టారు. దాదాపు 20 దేశాల్లో పర్యటించారు. 160 దేశాల ప్రతినిధులతో సమావేశమైన అనుభవం ఉంది. 2023లో అక్రమ సంబంధం కారణంగా మాజీ విదేశాంగ మంత్రి క్విన్‌గాంగ్ అరెస్టు తర్వాత.. ఆ స్థాయి దౌత్యవేత్తను అదుపులోకి తీసుకోవడం మళ్లీ ఇదే. ఈశాన్య ప్రాంతంలోని జిలిన్ ప్రావిన్స్‌లో లియు జన్మించారు. బీజింగ్ ఫారెన్ స్టడీస్ యూనివర్సిటీలో ఇంగ్లిష్‌లో మేజర్ పూర్తి చేశారు. ఆక్స్‌ఫర్డ్‌లో అంతర్జాతీయ సంబంధాలపై విద్యాభ్యాసం చేశారు. విదేశాంగశాఖలో అనువాదకుడిగా కెరీర్‌ను ప్రారంభించారు. బ్రిటన్‌లోని దౌత్య కార్యాలయంలో, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌లో చైనా రాయబారిగా పనిచేశారు.

## పాక్ ఆర్మీ చీఫ్ అమెరికాలో పర్యటన
### రెండు నెలల్లో రెండోసారి



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికాలో పర్యటించారు. అక్కడి రాజకీయ, సైనిక ఉన్నతాధికారులతోపాటు ప్రవాస పాకిస్థానీలతోనూ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ విందులో పాల్గొన్న మునీర్.. రెండు నెలల వ్యవధిలోనే మరోసారి అక్కడ పర్యటించారు. ముఖ్యంగా భారత్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ తాజా పరిణామం చోటుచేసుకుంది. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అమెరికాలో అధికారిక పర్యటన చేస్తు న్నట్లు పాక్ ఆర్మీ ఓ ప్రకటన చేసింది. అయితే, ఆయన ఎప్పుడు చేరుకున్నారు? ఎన్ని రోజులు ఉంటారనే విషయాలను వెల్లడించలేదు. యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ మైఖేల్ ఈ. కురిల్లా పదవీవిరమణ కార్యక్ర మంలో మునీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సైనిక సహకారంలో కురిల్లా నాయకత్వం ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఇతర సైనికాధికారులతో మునీర్ భేటీ అయ్యారు. పాక్ ప్రవాసులతో ముచ్చటించిన మునీర్, పాక్‌కు మంచి భవిష్యత్తు ఉందని, పెట్టుబడులు తేవడంలో సహకరించాలని చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ జూన్‌లోనూ అమెరికాలో పర్యటించారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోనూ విందు చేశారు. ఓ ఆర్మీ చీఫ్‌కు అమెరికా అధ్యక్షుడు విందు ఇవ్వడం అత్యంత అరుదు. అప్పట్లో భారత్ అభ్యంతరాల్ని బేఖాతరు చేస్తూ జరిగిన ఆ సమావేశంలో ఇరు దేశాలు వివిధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.



## 'నవోదయ'లో ఆరో తరగతి ప్రవేశాలు
### దరఖాస్తులకు ఇంకా మూడ్రోజులే గడువు

**న్యూఢిల్లీ :** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఇటీవల పొడిగించిన విషయం తెలిసిందే. అయితే, ఈ గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. అందువల్ల అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోండి. జూన్ 1న నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వగా.. జులై 29వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. అయితే, ఆ గడువు ఇటీవల ముగియడంతో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టు 13వరకు పొడిగించారు. దేశ వ్యాప్తంగా 654 జేఎన్‌వీల్లో 6వ తరగతిలో సీట్ల భర్తీకి రెండు విడతల్లో ఎంపిక పరీక్ష నిర్వహించనున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13 (శనివారం)నబీ జమ్మూ కశ్మీర్ సహా పలు పర్వత ప్రాంత రాష్ట్రాల్లో 2026 ఏప్రిల్ 11న ప్రవేశ పరీక్ష జరగనుంది. ఆసక్తి కలిగిన, అర్హులైన విద్యార్థులు జూలై 29 వరకు అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

#### ఎంపిక ప్రక్రియ ఇలా!

జేఎన్‌వీలో సీటు సాధిస్తే.. విద్యార్థులు ఆరో తరగతి నుంచి నుంచి ప్లస్ టు వరకూ నిశ్చింతగా చదువుకునే సువర్ణావకాశం దక్కుతుంది. ఇక్కడ చదువుతోపాటు ఆటపాటలకు, సమగ్ర వికాసానికీ ప్రాధాన్యమిస్తారు. దేశవ్యాప్తంగా 654 నవోదయ విద్యాలయాలు ఉండగా.. ఏపీలో 15, తెలంగాణలో 9 చొప్పున ఉన్నాయి. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం లభిస్తుంది. అభ్యర్థులు ప్రవేశం కోరే జిల్లాలోనే ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్నవారై ఉండాలి. విద్యార్థులు ఒకసారి మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అర్హులు. 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించగా.. మిగతా 25 శాతం సీట్లకు ఎవరైనా పోటీ పడొచ్చు. గ్రామీణ కోటాలో సీటు ఆశించే విద్యార్థులు 3,4,5 తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో లేదా గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో చదవాలి. మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయించారు. ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు కొన్ని సీట్లు ఉన్నాయి. బాలబాలికలకు విడిగా వసతి కల్పిస్తారు.

#### పరీక్ష ఎలా ఉంటుంది?

ఈ పరీక్షలో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లిష్.. ఇలా కోరుకున్న మాధ్యమంలో పరీక్ష రాసే వీలుంటుంది. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. మూడు సెక్షన్ల నుంచి మొత్తం 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. వీటిని 2 గంటల్లో పూర్తిచేయాలి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు. నెగెటివ్ మార్కుల్లేవు. సమాధానం గుర్తించడానికి బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ను ఉపయోగించి, ఓఎంఆర్ పత్రంలో సరైన ఆప్షన్ సూచించే గడిని దిద్దాలి. ఇక్కడ సీటు పొంది చదివినవారికి ఐఐటీ జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లోనూ రాణించేలా శిక్షణ అందిస్తారు.

## పుతిన్‌తో భేటీ.. జెలెన్‌స్కీనీ
# ఆహ్వానించనున్న ట్రంప్



**రష్యా :** రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఈ నెల 15న అమెరికాలోని అలాస్కాలో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ భేటీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా ఆహ్వానించడానికి ట్రంప్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వైట్‌హౌస్ పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి అలాస్కాలో పుతిన్, జెలెన్‌స్కీతో త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని ముందే ట్రంప్ భావించారు. ఇటీవల అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మాస్కో పర్యటన సమయంలోనూ ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. దీనిపై క్రెమ్లిన్ నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో.. తొలుత పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని యోచించారు. ఈ నేపథ్యంలో భేటీకి జెలెన్‌స్కీని ఆహ్వానించడంపై ట్రంప్ పునరాలోచిస్తున్నట్లు సమాచారం. శాంతి చర్చల్లో కీవ్‌ను కూడా భాగం చేయాలని యూకే, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలాండ్, ఫిన్లాండ్ వంటి యూరోపియన్ దేశాలు అగ్రరాజ్యానికి విజ్ఞప్తి చేయడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన అమెరికాలోని అలాస్కాలో పుతిన్‌తో భేటీ అవ్వనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పుతిన్‌తో సమావేశంలో యుద్ధాన్ని ముగించడంపై చర్చలు జరపనున్నామని ట్రంప్ తెలిపారు. శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. మరో వైపు భూభాగాల మార్పిడిని అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అలాస్కా సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు పాల్గొంటారా లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## బెంగళూరు మెట్రో ఎల్లో లైన్‌ను ప్రారంభించిన మోదీ



**బెంగళూరు :** ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరులో పర్యటించారు. బెంగళూరు - బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్ - కాట్రా , నాగ్‌పుర్ - పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు-బొమ్మసంద్ర మధ్య ఎల్లో లైన్( 19.15 కిలోమీటర్లు) మార్గాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు.


నాడు ఓట్ల చోరీ.. నేడు క్రెడిట్ చోరీ: ప్రియాంక్ ఖర్గే విమర్శలు ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరు మెట్రో ఎల్లో లైన్ ప్రారంభించడంపై కర్ణాటక కాంగ్రెస్ నేతలు భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. తాము కష్టపడి రూపొందించిన అర్బన్ మొబిలిటీ ప్రాజెక్ట్‌కు భాజపా క్రెడిట్ తీసుకుంటోందని ఆ రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమయ్యిందని దుయ్యబట్టారు. ఇప్పటిదాకా ఓట్ల చోరీ చేసి అధికారంలోకి వచ్చిన భాజపా.. ఇప్పుడు క్రెడిట్ చోరీ చేస్తోందని మండిపడ్డారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అప్పట్లో భారీగా ఖర్చు చేసి ప్రారంభించిన ఈ మెట్రో ప్రాజెక్టుకు భాజపా అధికారంలోకి వచ్చాక నిధుల కేటాయింపు తగ్గిందని ఆరోపించారు. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అధిక భారం పడడంతో అప్పులు కూడా చేయాల్సివచ్చిందన్నారు.

## అపరిశుభ్రమైన సీటు.. ఇండిగోకు రూ.1.5 లక్షల జరిమానా




**న్యూఢిల్లీ :** ఓ ప్రయాణికురాలికి అపరిశుభ్రమైన, అసౌకర్యవంతమైన సీటును కేటాయించినందుకుగాను ఇండిగో ఎయిర్ లైన్స్‌కు దిల్లీ వినియోగదారుల ఫోరం రూ.1.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సదరు ప్రయాణికురాలికి చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 5న తాను ప్రయాణించిన బాకు-న్యూదిల్లీ ఇండిగో విమానంలో తనకు అపరిశుభ్రమైన సీటు కేటాయించినట్లు పింకీ అనే మహిళ దిల్లీలోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. దీని వల్ల తాను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలిపారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన కమిషన్ ప్రయాణికురాలు ఎదుర్కొన్న అసౌకర్యం, మానసిక వేదనకు పరిహారం చెల్లించాలని ఇండిగోను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఆమె ఖర్చు చేసిన రూ.25,000 కూడా చెల్లించాలని పేర్కొంది. అయితే.. ఈ ఆదేశాలను ఇండిగో వ్యతిరేకించింది. ప్రయాణికురాలికి కేటాయించిన సీటు సరిగ్గా లేకపోడంతో ఆమె అభ్యర్థన మేరకు తాము వేరే సీటు కేటాయించినట్లు తెలిపింది. అనంతరం ఆమె సౌకర్యవంతంగా తన ప్రయాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొంది. అయినప్పటికీ వినియోగదారుల ప్రయాణ సమాచారాన్ని తెలిపే అంతర్గత కార్యాచరణ రికార్డులలో భాగమైన సిట్యువేషన్ డేటా డిస్‌ప్లే నివేదికను సమర్పించడంలో ఎయిర్‌లైన్స్ విఫలమైనందున జరిమానాను చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం స్పష్టం చేసింది.

## ఉగ్రవాదులను చుట్టుముట్టిన సైన్యం



**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు ఊపిరాడకుండా సైన్యం ఆపరేషన్లు కొనసాగిస్తోంది. తాజాగా కిష్త్వార్‌లో పలువురు ఉగ్రవాదులు నక్కినట్లు దళాలకు సమాచారం అందడంతో గాలింపు చేపట్టింది. ఈ క్రమంలో దుల్ జనరల్ ఏరియాలో ఉగ్రవాదులు, దళాలకు మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని వైట్‌నైట్ కోర్ ఎక్స్‌లో పోస్టు చేసింది. పూర్తిగా పర్వత ప్రాంతమైన కిష్త్వార్‌లో టెర్రరిస్టులు ఉన్నట్లు పక్కా సమాచారం అందినట్లు సైన్యం వెల్లడించింది. ప్రస్తుతం భారీగా కాల్పులు జరుగుతున్నాయి. మరోవైపు కుల్గాంలో అపరేషన్ అఖల్ 10వ రోజుకు చేరింది. వీరమరణం పొందిన లాన్స్‌నాయక్ ప్రీత్‌పాల్ సింగ్, సిపాయ్ హర్మీందర్ సింగ్‌కు చినార్ కోర్ నివాళి అర్పించింది. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది. పారా కమాండోలు, రాష్ట్రీయ రైఫిల్స్, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసు బలగాలు హెలికాప్టర్లు, డ్రోన్లు, ఇతర నిఘా పరికరాల సాయంతో ఆ ప్రదేశాన్ని జల్లెడ పడుతున్నాయి. ఇక్కడ రాత్రివేళల్లో చూసే థర్మల్ ఇమేజింగ్ పరికరాలను కూడా తీసుకొచ్చారు. గత రెండువారాల్లో భద్రతా దళాలు నాలుగు ఉగ్ర ఏరివేత ఆపరేషన్లు చేపట్టాయి. పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆపరేషన్ మహాదేవ్‌తోనే ఇది మొదలైంది. ఇటీవలే ఆపరేషన్ శివ్‌శక్తిని చేపట్టి ఇద్దరు ఉగ్రవాదులను అంతం చేసింది.

# 'మీ కుర్రాడు బాగా ఫైట్ చేశాడు..
### పుతిన్ శైలి మైండ్‌గేమ్



**రష్యా :** అమెరికా.. పశ్చిమ దేశాల నేతలు, ప్రతినిధులకు రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యేటప్పుడు ఏదో లోపల గుబులుగానే ఉంటుంది. ఎందుకంటే మాస్కో అధినేత ఎప్పుడూ తనదైన శైలిలో మైండ్‌గేమ్స్‌తో వారిని దిగ్భ్రాంతికి చేస్తుంటారనే పేరుంది. ఓ సారి జర్మనీ నేత వద్దకు పెంపుడు కుక్కను పంపి భయపెట్టగా.. మరో సారి ఫ్రాన్స్ నేతను అల్లంత దూరంలో కూర్చోబెట్టి మాట్లాడారు. ఈ సారి వంతు ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌ది. ఇటీవల ట్రంప్ తరఫున రాయబారానికి వచ్చిన ఆయనకు పుతిన్ ఇచ్చిన గిఫ్ట్ చూసి ఎలా స్పందించాలో అర్థం కాలేదు. ఆ కథేంటో చదవండి.. అమెరికా దూత స్టీవ్ విట్కాఫ్ ఇటీవల పుతిన్‌కు ట్రంప్ సందేశం చేరవేసేందుకు క్రెమ్లిన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా తళతళలాడుతున్న 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని తీసుకొచ్చి రష్యా అధినేత వాషింగ్టన్ దూతకు ఇచ్చారు. దానిని సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినాకు అందజేయాలని సూచించారు. రష్యా తరఫున సదరు అధికారిణి 21 ఏళ్ల కుమారుడు మైఖెల్ గ్లోస్ ఉక్రెయిన్‌తో పోరాడి మరణించాడని.. అతడి సాహసానికి గౌరవంగా ఈ పతకం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జూలియన్ సీఐఏ డిజిటల్ ఇన్నోవేషన్ విభాగంలో పనిచేస్తున్నారు. పుతిన్ అవార్డ్ ఇచ్చిన సమయం సందర్భాన్ని చూస్తే కచ్చితంగా ఇది ఆయన మైండ్‌గేమే అని నిపుణులు చెబుతున్నారు. అమెరికా సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడే రష్యా పక్షాన పోరాడాడు అనే ప్రశ్నలు లేవనెత్తడానికే ఇలా చేసినట్లు అనుమానిస్తున్నారు. అమెరికా ప్రతినిధి ఈ అవార్డును తీసుకొన్నారా.. లేదా అనే విషయంపై మాత్రం స్పష్టత లేదు. అటు శ్వేత సౌధం, సీఐఏ, ఇటు విట్కాఫ్ ఈ కథనాలపై నోరు మెదపలేదు. రష్యా వైపు నుంచి కూడా స్పందన లేదు. ఇక యుద్ధ రంగంలో మరణించినట్లు చెబుతున్న గ్లోస్ సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడు. మాస్కోలో దిగిన చిత్రాలు కూడా ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ 4వ తేదీన తూర్పు ఐరోపాలో అతడు మరణించినట్లు చెబుతున్నారు. అతడి మృతదేహం అమెరికా చేరుకొన్న వేళ.. 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రోస్ మరణం జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాదని.. అతడు చాలా మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నాడని పేర్కొంది. తమ అధికారిణి జూలియన్ కుటుంబం తీవ్ర విషాదాన్ని చవి చూశారని పేర్కొంది. మైఖెల్ గ్లోస్ తండ్రి లారీ గ్లోస్ మీడియాతో మాట్లాడుతూ తమ కుమారుడు రష్యా సైన్యంలో చేరాడని, ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొన్నాడని తమకు తెలియదన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక..
# 'మేక్ ఇన్ ఇండియా' : ప్రధాని మోదీ



**పాకిస్థాన్ :** పాకిస్థాన్‌ను మట్టికరిపించిన 'ఆపరేషన్ సిందూర్' విజయం వెనుక 'మేక్ ఇన్ ఇండియా', మన సాంకేతికత దాగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరికొత్త భారత్‌ను ప్రపంచం మొదటిసారి చూసిందన్నారు. రూ.15,610 కోట్ల వ్యయంతో బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. నవ భారతానికి చిహ్నంగా బెంగళూరు ఎదుగుతోందన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసింది. మన బలగాలు పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. కొన్ని గంటల్లోనే ఆ దేశాన్ని మోకరిల్లేలా చేశాయి. ఈ విజయానికి మన టెక్నాలజీ, రక్షణా రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' శక్తి దోహదపడ్డాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. 2014కు ముందు కేవలం ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు.. నేడు 24 నగరాలకు విస్తరించాయన్నారు.


#### కేంద్రం కంటే ఎక్కువ ఖర్చు : సిద్ధరామయ్య

బెంగళూరు మెట్రో కోసం కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. "ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం, రాష్ట్రం సమానంగా నిధులు సమకూర్చాల్సి ఉంది. అయినప్పటికీ.. రాష్ట్రం ఎక్కువ ఖర్చు చేస్తోంది" అని తెలిపారు. అభివృద్ధి విషయంలో మహారాష్ట్ర, గుజరాత్‌ల మాదిరే కర్ణాటకకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అంతకుముందు బెంగళూరు-బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్-కాట్రా, నాగ్‌పుర్-పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు- బొమ్మసంద్ర మధ్య ఎల్లో లైన్ (19.15 కిలోమీటర్లు) మార్గాన్ని ప్రారంభించారు.

## భర్తతో గొడవ.. ముగ్గురు పిల్లలతో కలిసి
# కాలువలోకి దూకిన మహిళ



**ఉత్తర్ ప్రదేశ్ :** భర్తతో గొడవలతో విసుగెత్తిన ఓ మహిళ ముగ్గురు పిల్లలతో కలిసి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని బండా జిల్లాలోని రిసౌరా గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రిసౌరా గ్రామంలో నివసిస్తున్న రీనా, అఖిలేశ్ దంపతులకు ముగ్గురు సంతానం. శుక్రవారం రాత్రి భర్తతో గొడవ జరగడంతో పిల్లలను తీసుకొని ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఉదయం లేవగానె చూసేసరికి కోడలు, పిల్లలు కనిపించక పోవడంతో అత్తమామలు వారి కోసం వెతకగా.. చివరికి సమీపంలోని కెన్ కాలువ వద్ద వారికి సంబంధించిన దుస్తులు, గాజులు, చెప్పులు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కాలువలోకి దూకి ఉండవచ్చుననే అనుమానంతో పోలీసులు ఈతగాళ్ల సహాయంతో దాదాపు ఆరుగంటలు గాలింపు చర్యలు చేపట్టాగా.. చివరికి వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో మహిళ రీనా(30), ముగ్గురు చిన్నారులు హిమాన్షు(9), అన్షి(5), ప్రిన్స్(3)గా పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టంకి తరలించారు. మహిళ భర్త అఖిలేశ్‌ని కస్టడీలోని తీసుకొని విచారిస్తున్నట్లు అదనపు ఎస్పీ శివ రాజ్ తెలిపారు.



## మేమే బాస్ అనుకునేవాళ్లకు
# భారత్ వృద్ధి నచ్చలేదు
### కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ :** భారత్ వేగంగా అభివృద్ధి చెందడాన్ని కొన్ని దేశాల నేతలు చూడలేకపోతున్నారని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అందరికీ మేమే బాస్ అనుకునే వాళ్లకు భారత్ వృద్ధి నచ్చలేదని అన్నారు. తమతో సమానంగా భారత్ మారకూడదనే అహంకారంతో..దేశాభివృద్ధిని కుంటుపడేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఆ దేశాల ఉత్పత్తుల కంటే భారత వస్తువులు, ఉత్పత్తులు మరింత ఖరీదయ్యేలా చేయడానికి అధిక సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివృద్ధిని ఎవరూ ఆపలేరని అన్నారు. భారత్ అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని అన్నారు. మన దేశాన్ని తయారీ, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన 'మేకిన్ ఇండియా' వల్ల వివిధ రంగాల్లోస్వదేశీ ఉత్పత్తులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశ రక్షణ ఎగుమతులు రూ.24,000 కోట్లు దాటాయని.. ఇవి రక్షణ రంగ బలాన్ని, అభివృద్ధిని సూచిస్తున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రాజ్‌నాథ్ సింగ్ రైలు, మెట్రో కోచ్ తయారీ యూనిట్ 'గ్రీన్‌ఫీల్డ్ రైల్ కోచ్ తయారీ కేంద్రం'కు శంకుస్థాపన చేశారు. 60 హెక్టార్లకు పైగా విస్తరించి ఉన్న ఈ ఫ్యాక్టరీ మెట్రో రైళ్లు, వందే భారత్ రైళ్లకు కోచ్‌లను తయారు చేస్తుంది. రూ.1,800 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు మొదటి దశ 2026లో పూర్తయ్యే అవకాశం ఉంది. అనంతరం ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.





## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

## అందజేసిన నీరజ వెంకటేశ్వర్ రెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు కాడిగళ్ల రాములమ్మ,రాపోలు నర్సింహా లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కెసిరెడ్డి నీరజ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కెసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లు మానవత దృక్పథంతో కాడిగళ్ల రాములమ్మ కుటుంబ సభ్యులకు బియ్యం,నిత్యావసర సరుకులు రాపోలు నర్సింహా కుటుంబానికి 5,000/-ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల వెంకటేశం మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ రసూల్ నాయకులు పులిపలుపుల రాములు,ఆకుల మల్లేశం,పులిపలుపుల అంజయ్య,ఏనుగుల నర్సింహా, కొలగాని యాదయ్య,జంగం రాములు,పట్టేడి జగన్,కాడిగళ్ల రమేష్,లింగయ్య,పగిళ్ళ రమేష్,కాడిగాళ్ల బుచ్చయ్య, జోగు ముత్యాలు,సాదుల పాపయ్య పాల్గొన్నారు.



## వర్షంలో కూడా వనభోజనాలకు

## వెళ్ళిన పల్లెర్ల గ్రామస్తులు

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలంలోని పల్లెర్ల గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా గ్రామ దేవతలను పూజించి వనభోజనాలు చేశారు. వారు మాట్లాడుతూ అలా పూర్వం మహర్షులు ఆచరించిన శ్రావణమాసం సందర్భంగా వనభోజనాలు ఇప్పటికి ఏర్పాటు చేసుకుంటున్నాం నలుగురితో కలిసి ఆనందిస్తున్నాం ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం ఆరోగ్యం సందేశాన్ని హార్దిక భోజనాలు మనకు చాటు చెబుతున్నాయి దేశ సంస్కృతి సాంప్రదాయాలను హైందవ ధర్మ మార్గాన్ని అనుసరించి అనాదిక వస్తున్న దీనినే శ్రావణమాసం వనభోజనాలుగా పిలుస్తామని తెలిపారు. వర్షంలో కూడా మన సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తున్నాం అని అన్నారు. ఈ వనభోజనాల్లో పాల్గొన్న ఎడ్ల సాయిబాబ అనిత,దంపతులు,కొమ్ము రమేష్ అనిత, కొమ్ము మచ్చగిరి,అనిత కొమ్ము రాజు సుచరిత తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధువరులను ఆశీర్వదించిన

## తాజా మాజీ జడ్పిటిసి నరేందర్ గుప్తా

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన లోడి భారతమ్మ యాదయ్య గౌడ్ కుమారుడు లో డి నరేష్ గౌడ్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన తాజా మాజీ జెడ్పిటిసి కొడిత్యాల నరేందర్ గుప్తా తాజా మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి వార్డ్ మెంబర్ సోలి పురం నరసింహారెడ్డి మరియు ఘర్షకోట శ్రీనివాస్ లోడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ దారులారా పెన్షన్ పెంపు కోసం

## ఆలేరుకు తరలిరండి

- ఈనెల 13న ఆలేరులో జరుగు పెన్షన్ దారులసదస్సు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**మోటకొండూర్, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామంలో పెన్షన్ దారులతో ప్రచార సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ ఈనెల 13వ తారీఖున పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పెన్షన్ లు పెంచాలనే డిమాండ్ తో జరుగబోతున్న చేయూత పెన్షన్ దారుల నియోజకవర్గ సదస్సుకు ఆలేరు నియోజకవర్గ కేంద్రానికి విచ్చేస్తున్నారు కావున ఆలేరు నియోజకవర్గంలో ఉన్నటువంటి వృద్ధులు వితంతువులు వికలాంగులు ఒంటరి మహిళలు గీత కార్మిక నేత కార్మిక బీడీ కార్మిక పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొని మహాగర్జన జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి ఎచ్ పి యస్ జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్,ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్ మాదిగ, వి ఎచ్ పి యస్ మండల ఇంచార్జ్ ఎం డి ఉస్మాన్, గ్రామ శాఖ అధ్యక్షులు గంధమల్ల శ్రీను మాదిగ, గుర్రాల స్వామి, సకినాల నరేష్, సకినాల రవి, ఎం డి యూనిస్, ఎదునూరి రవి, తాళ్ల నర్సింహ్మా, దేవళ్ల ఐలయ్య,ముస్త్యాల అంజయ్య, బండి జమ్మయ్య, నాగిళ్ల రాజయ్య, నాగిళ్ల చిలకమ్మ, సొప్పరి నర్సయ్య, తండ భీమయ్య గౌడ్, గౌరారం నర్సయ్య, తాల్క యాదయ్య, భూదేవి సాయిలు, సీస రాములు గౌడ్, గుళ్ళపల్లి విజ్జు గౌడ్, పంగ లక్ష్మమ్మ, నాగుల్లా ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ 42 శాతం రిజర్వేషన్ లకు చట్టబద్ధత కల్పించకుండా

# వ్యతిరేకంగా మాట్లాడుతున్న బిజెపిని గద్దెదించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**వలిగొండ, రాజముద్ర న్యూస్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా అమలుకు చట్టం చేయకుండా వాటికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న బిజెపిపై సామాజిక వర్గాలు చైతన్యమై ఢిల్లీ గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్,మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు జి రాములు లతో కలిసి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయకుండా నిర్లక్ష్యంతో బీసీల పట్ల వ్యతిరేక భావంతో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ బిల్లుపై తీవ్ర వ్యతిరేకంగా మాట్లాడడం బీసీల పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధిని అర్థం రుజువు చేస్తుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో బిజెపి నుండి గెలిచిన 8 మంది ఎంపీలు పార్లమెంట్లో నోరు మెదపకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు పైగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేది లేదంటూ కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ మాట్లాడటం సిగ్గుమాలిన చర్య అని వెంటనే బీసీలకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు బీహార్ లో జరుగుతున్న ఎన్నికల్లో పెద్ద ఎత్తున నకిలీ ఓటర్లను సృష్టించి అధికారంలోకి వచ్చేందుకు రాజ్యాంగ హక్కులను బిజెపి నాయకులు ఉల్లంఘిస్తున్నారని ఇది దేశ సార్వభౌమత్వానికి వ్యతిరేకమన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లపై మనువాద భావాజాలంతో వ్యతిరేకిస్తున్న బిజెపిని గద్దె దించడమే దేశంలో ఉన్న ప్రజల తక్షణ కర్తవ్యమని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్, మల్లు లక్ష్మిలు మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో దళితులపై గిరిజనులపై మైనార్టీలపై అణగారిన వర్గాల ప్రజలపై పెద్ద ఎత్తున దాడులు దౌర్జన్యాలు చేస్తుందని మనువాద భావాజాలాన్ని ముందుకు తీసుకొచ్చి భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే కుట్రలు చేస్తుందని దేశంలో అణగారిన వర్గాలకు రిజర్వేషన్లను లేకుండా చేయాలని కుట్ర చేస్తుందని బిజెపి విధానాలను ప్రజలందరూ అర్థం చేసుకొని బిజెపి విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, తప్పట్ల స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,గోకారం మాజీ సర్పంచ్ సిర్పంగి శ్రీరాములు,మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్, నాయకులు వడ్డెబోయిన వెంకటేష్, వనం రాజు,నారి రామస్వామి, రాపోతు వెంకులు, రాహుల్ పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వలిగొండ, రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అఫ్రోచ్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పిటిసి జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేశిరెడ్డి జనార్ధన్ రెడ్డి,మాజీ సర్పంచులు వంగాల బిక్షపతి గౌడ్, కాసుల కృష్ణ, కొంతం శ్రీనివాస్, గంగారం రమేష్, రామహరి, రమేష్, ఎంపీటీసీలు మోటె నరసింహ, చేగురి గోపాల్, నాయకులు కొండూరు వెంకటేష్, గంగాదారి ఆశయ్య కాటేపల్లి వెంకులు, ఈతప మల్లేష్,యూత్ అధ్యక్షులు పల్సం రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎడవెల్లి శాంతి కుమార్, మన్నె ప్రకాష్ రెడ్డి,కళ్లెం మారయ్య, పైళ్ల మల్లారెడ్డి, పబ్బు స్వామి, సోమనబోయిన రమేష్, ఐటి పాముల సత్యనారాయణ, పోలేపాక బిక్షపతి,పబ్బు వెంకటరమణ, పోలెపాక సత్యనారాయణ, నానమాల ఉప్పలయ్య, మల్లం కిష్టయ్య, చెవ్వ వెంకటేష్, మల్లం నరేష్, కడవేరు యాదగిరి, ,గ్రామ శాఖ అధ్యక్షులు బొడిగే లింగస్వామి, నరసింహారెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, దుబ్బ నరేష్,బుగ్గ మల్లేశం, కాశమల్ల శేఖర్, నక్కల నరేందర్ రెడ్డి,కందారపు సురేష్, మర్రి వెంకన్న, ఉలిపే పాండు, బత్తిని శేఖర్, బల్గురి నరేష్ రెడ్డి,,కోనపూరి శ్రీశైలం, ఆలకుంట్ల రాజు,కొమురయ్య, పల్లెర్ల రామచందర్, నరేందర్ రెడ్డి, పిట్టల కుమార్, బూడిద పాపయ్య, గట్టు పాపయ్య, గోపగోని నవీన్, బూడిద స్వామి, పల్లె శ్రీశైలం, చేగూరి నరసింహ బొల్లారం జాంగిర్, శంకర్ రెడ్డి, ఉక్కుర్తి యాదయ్య, బరిశెట్టి పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ నాయకులు ఇంజన్ నరేష్‌కు

## రాఖీ కట్టిన మంత్రి సీతక్క

**రాజపేట రాజముద్ర న్యూస్ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ అలియాస్ సీతక్క ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంజ నరేష్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇంజ నరేష్ చేనేతకారులు నేసిన మగ్గం చీరను సీతక్కకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఇంజ కర్ణాకర్, ఇంజ చింటు తదితరులు పాల్గొన్నారు.

## అల్లం ఉమా రాణికి ఘన నివాళులు

### తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్



**హుజూర్నగర్, రాజముద్ర న్యూస్ :** హుజూర్నగర్ శ్రీ నగర్ కాలనీలోని విజయ విద్యా మందిర్ స్కూల్ ప్రాంగణంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఉమ్మడి నల్గొండ జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్,ప్రస్తుత కబడ్డీ సూర్యాపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు అల్లం ప్రభాకర్ రెడ్డి సతీమణి అల్లం ఉమా రాణి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆర్. సి.యం ఫాదర్ మరియు సిస్టర్స్ వారి కొరకు,వారి కుటుంబం కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రైస్తవులు నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్,ఐ.యన్.టీ.యు. సి రాష్ట్ర కార్యదర్శి మరియు దక్షిణ ఇండియా రైల్వే మెంబెర్ యర్రగాని నాగన్న గౌడ్, ఉమ్మడి నల్గొండ జిల్లా సి.సీ.టీ.చైర్మన్ పోకల అశోక్ (గాబ్రియేల్), హెబ్రోన్ సొసైటీ చైర్మన్ బ్రదర్ పీతరా చారి హైదరాబాద్ ,కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ రాష్ట్ర నాయకులు ఉటుకూరి రాజు, పేతురు పాల్గొని చిత్ర పఠానికి నివాళులు అర్పించారు.



## మృతుల కుటుంబాలను

## పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ పట్టణంలో ఇటీవల మరణించిన పలువురు మృతుల కుటుంబాలైన పొలెపాక శశాంక్ కుటుంభాన్ని, యాట శంకరయ్య కుటుంభాన్ని, పబ్బు అండాలు కుటుంభాన్ని, పోలేపాక నర్సమ్మ కుటుంభాన్ని, రచ్చ శ్రీను కుటుంభాన్ని, ఎగ్గె నవీన్, బత్తిని స్వామి గౌడ్ కుటుంబ సభ్యులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం రోజున వారిని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ నూతి రమేష్,వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కంకల కిష్టయ్య, కుంభం విద్యాసాగర్ రెడ్డి కుంభం వెంకట పాపిరెడ్డి,కొండూరు భాస్కర్, కొండూరు సాయి, కాసుల వెంకన్న,మైసొల్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో ఘనంగా బోనాల పండుగ

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**సూర్యాపేట, రాజ ముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం వైభవోపేతంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ ఊర ముత్యాలమ్మ తల్లి దేవాలయంతో పాటు తిరుమలనగర్ లో గల భేచిరాగ్ మా దారం ముత్యాలమ్మ తల్లి దేవాలయాల్లో నిర్వహించిన బోనాల పండుగ వేడుకకు మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయా దేవాలయాల నిర్వాహకులు, పూజారులు ఘన స్వాగతం పలికి సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆయా దేవాలయాల్లో చిన్నారులు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగి సందడి చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**ఆత్మకూర్( ఎం )రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలవల్ల ఆస్పత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సహకారంతో కన్యవేణి దిలీప్ కు 22500 చెక్కును తాజా మాజీ జెడ్పిటిసి సభ్యులు కొడిత్యాల నరేందర్ గుప్తా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి,ఇందిరమ్మ కమిటీ మెంబర్ వస్తుపుల ఎల్లయ్య ఘర్షకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## దండు మైసమ్మ ఆలయం

## ప్రతిష్ట వార్షికోత్సవములు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ఆత్మకూర్ ఎస్ మండలం నెమ్మికల్ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దండుమైసమ్మ ఆలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు కరపత్రాలను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, ఏఐసిసినాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి,శ్రీ దండు మైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి తో పాటు కమిటీ సభ్యులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14 నుండి 17 వరకు శ్రీ దండు మైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవములు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 నుండి 16 వరకు వార్షికోత్సవ వేడుకలు, ఈనెల 17 ఆదివారం బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ ఆశీస్సులు పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో శ్రీ దండు మైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రేణిగుంట్ల సునీత, జంగబాలరాజు,మోరపాక రాజు, గోపగాని లక్ష్మి ,పేరం శ్రీనివాస్, బొడ్డుపల్లి విజయలక్ష్మి పచ్చిపాల శీను, కాసర్ల రామ్ రెడ్డి వీరబోయిన రేణుక, మోరపాక లచ్చయ్య,బోర రాములు,ఎరుకల నరసయ్య, చెరుకుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో
# పాక్‌కు చెక్ పెట్టాం
### ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారతీయ వాయుసేన పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, మరో పెద్ద విమానాన్ని నేలకూల్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆపరేషన్ సిందూర్‌పై ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం దాయాది దేశంతో చెస్ ఆడిందని అన్నారు. శత్రువు తదుపరి కదలికలు ఏమిటో కూడా ఆ సమయంలో తమకు తెలియదని.. ఈ పరిస్థితిని గ్రేజోన్ అంటారని అన్నారు. అయినప్పటికీ సమయానుకూలంగా స్పందిస్తూ.. ఆ దేశానికి చెక్ పెట్టామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను ప్రభుత్వం, భారత సైన్యం ఎంతో వ్యూహాత్మకంగా అమలు చేశాయని ద్వివేది తెలిపారు. మన పౌరులను బలి తీసుకున్న ఉగ్రవాదులను అంతం చేయాలని త్రివిధ దళాలు కోరినప్పుడు.. ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి స్వేచ్ఛ ఇచ్చారని వెల్లడించారు. దీంతో తాము ఉగ్ర స్థావరాలను సమర్థవంతంగా ధ్వంసం చేశామన్నారు. ఆపరేషన్ అనంతరం పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ మునీర్ ను ఆ దేశ 'ఫీల్డ్ మార్షల్'గా నియమించడాన్ని ద్వివేది ఎద్దేవా చేశారు. వారు యుద్ధంలో గెలవకపోయినా ఆర్మీ అధికారికి అత్యున్నత పదవి ఇవ్వగానే అక్కడి ప్రజలు తాము గెలిచామనే భ్రమలో ఉన్నారని పేర్కొన్నారు. కానీ అది విజయమా లేదా అపజయమా అనేది వారి మనస్సాక్షికే తెలుసన్నారు. మూడు నెలల క్రితం జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ విమానాలను కూల్చిన విషయాన్ని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం మొదటిసారి బహిర్గతం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్‌లో సాధించిన విజయాలు వివరించారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను ఏవిధంగా ధ్వంసం చేసిందీ తెలిపారు.

## నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాల్లో
# పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి తదనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని రేవంత్ కు పాలన చేతకాకనే కాలం వెళ్ళ బుచ్చుతున్నాడు అన్నారు. రెండేళ్లు కావస్తున్నా రేవంత్ బూతుపురాణాలు మానడం లేదన్నారు. ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టే మాట్లాడుతున్నాడని ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించేందుకు కొత్త నాటకాలు ఆడుతున్నాడు అని తెలిపారు. ఒక్క రంగంలో కూడా అడుగు ముందుకేసిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాలను కూడా కుంటిపస్తున్నట్లు తెలిపారు. కొత్త ఇండ్లు కట్టిస్తామని చెప్పి. ఉన్న ఇల్లు కూలగొట్టే పని చేపట్టారని కొత్త ప్రాజెక్టుల మాట దేవుడెరుగు.. వున్న ప్రాజెక్టులను బందుపెట్టి పొలాలను ఎండబెడుతున్నారని కాంగ్రెస్ బిజెపి సహకారంతోనే కెసిఆర్ పై కుట్రలు చేస్తున్నట్లు తెలియజేశారు. బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఇద్దరికి కెసిఆరే ప్రధాన శత్రువు అని దీంతో రేపటి తెలంగాణ కెసిఆర్ దే అని వాళ్లకు అర్థమైందని మళ్ళీ ప్రజా సంక్షేమ పార్టీ బి ఆర్ ఎస్ రాబోతుందని వాళ్లకు అర్థమైందని అందుకే కక్కలేక మింగలేని స్థితిలో రేవంత్ పాలన సాగుతుందన్నారు. రేవంత్,బండి సంజయ్ ల రాజకీయ చరిత్ర అందరికీ తెలుసని స్ట్రీట్ ఫెలోస్ స్టేట్ లీడర్ అయిండు.గల్లి నాయకుడు ఏకగ్రీవంగా ఢిల్లీ ప్రమోషన్ రావడంతోనే ప్రజలకు కష్టాలు వచ్చినట్లు అన్నారు. కనీసం ట్రాఫిక్ నియాంత్రించే సత్తువకూడా కాంగ్రెస్ కు లేదని నీళ్లలో వాటర్ కలవడం వల్లనే శ్రీశైలం మార్గం కుంగి పోయిందని డ్రైన్ వాటర్ లో రైన్ వాటర్ కలవడం వల్లనే వరదలొచ్చినాయన్న అజ్ఞాన మంత్రులతో ఏం అభివృద్ధి సాధించారని అన్నారు. దీంతో కొత్తదనం పిల్లలకు వాళ్ళ మాటలు అర్థం కాక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యల పైన అవగాహనా లేదు.. అభివృద్ధి చేసే దమ్ము లేకనే అర్థం లేని మాట్లాడుతున్నారని వాస్తవానికి బీజేపీ,కాంగ్రెస్ జాతీయ పార్టీలుగా ఒకరినొకరు విమర్శించుకోవాలని అన్నారు. కానీ ఇద్దరూ కలిసి కెసిఆర్ మీద ఏడుస్తున్నప్పుడే ప్రజలకు అర్థమైంది అని వాళ్లెంత దిగజారి మాట్లాడినా.. మేము ప్రజలకు అర్థమయ్యే భాషలోనే మాట్లాడతాం అన్నారు. చిల్లర చేరికలతో బిజెపి స్థాయి ఏందో తెలుస్తుందని ఎవరో మాజీ ఎమ్మెల్యేను పట్టుకుని బీజేపీ ఏదో ఊహించికుంటే అయిపోతుందా.. దీంతో పార్టీ పెరుగుతది. ఓట్లు వస్తాయి అనుకుంటే వారి భ్రమే తప్ప ఏం లేదన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల తోనే మోడీ ఓటమి మొదలైందని ప్రజల ఆకలి.మీరు ఇచ్చిన హామీల ముందు మీ మోసాలు నిలబడవాని రేవంత్,బండి ప్రమాణాలు ప్రజలందరికి తెలుసని దేవుళ్ళ మీద విశ్వాసం లేని వాళ్ళు ఎవరైనా ఉన్నారంటే.అది రేవంత్, బండిలే.. అన్నారు.ప్రతీ విషయాన్నీ దేవుళ్ళ మీద పెట్టేవాడు భక్తుడు ఎట్లా అయ్యతడని ప్రశ్నించారు. నిజంగా ట్యాపింగ్ చేయించింది కేటీఆర్ అని బండి సంజయ్ నువ్వు ప్రమాణం చేస్తావాఅని ప్రశ్నించారు. ఏదైనా మాట్లాడితే బాధ్యతాయుతంగా మాట్లాడాలన్నారు. చిల్లర మాటలు,ఈ బూతు మాటలతోటి ప్రజల కడుపులు నింపవని ఇలాంటి మాటలు రాజకీయాలకు కూడా పనికొచ్చేవి కావని తెలిపారు.

# మరో మార్గం లేదు
### 'గాజా ఆక్రమణ'పై నెతన్యాహు



**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయడం తప్పితే మరో మార్గం లేదని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్‌ను అంతం చేసే ప్రక్రియను పూర్తిచేయడమే తమ లక్ష్యమన్నారు. జెరూసలెంలో విదేశీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గాజాపై సైనిక చర్య ప్రణాళికను సమర్థించుకున్నారు. తదుపరి చర్యల కోసం చాలా తక్కువ సమయం ఉందన్నారు. గాజాను ఆక్రమించడం తమ లక్ష్యం కాదని, దానికి స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యమని నెతన్యాహు మరోసారి స్పష్టం చేశారు. తమ చర్యలను ఖండిస్తూ స్థానికంగా, ఇజ్రాయెల్ బయట జరుగుతున్నది తప్పుడు ప్రచారమేనని అభిప్రాయ పడ్డారు. గాజాను సైనిక రహితంగా మార్చడం, అక్కడి భద్రతను ఇజ్రాయెల్ సైన్యం తమ నియంత్రణలోకి తీసుకోవడం వంటివి తమ ఉద్దేశమన్నారు. హమాస్ చర్యలే గాజా పౌరుల మరణాలు, నగరాల నాశనం, మానవతా సాయం అందకపోవడం వంటి సమస్యలకు కారణమని నెతన్యాహు మరోసారి ఆరోపించారు. ఇదిలాఉంటే, గాజా సిటీ స్వాధీనానికి ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఇటీవల ఆమోదం తెలపడంపై స్థానికంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సహా చాలా దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించాయి. ఈ నేపథ్యంలోనే నెతన్యాహు స్పందిస్తూ.. మరో మార్గం లేదని చెప్పారు.



## 'ఒకే మహిళ రెండుసార్లు ఓటు' ఆరోపణలు
### రాహుల్ గాంధీకి నోటీసులు

**న్యూఢిల్లీ :** ఓ మహిళా ఓటరు రెండుసార్లు ఓటేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయనకు కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నోటీసులు జారీ చేశారు. ఆ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకుగానూ సంబంధిత పత్రాలను సమర్పించాలని సూచించారు. మరోవైపు.. ఎన్నికల సంఘం కూడా ఓట్ల చోరీ ఆరోపణలపై డిక్లరేషన్ సమర్పించాలని, లేదా తప్పుడు ఆరోపణలకు దేశానికి క్షమాపణ చెప్పాలని మరోసారి కోరింది. "ఇటీవల ప్రజెంటేషన్‌లో చూపిన పత్రాలు.. ఎన్నికల కమిషన్ రికార్డుల నుంచి సేకరించినట్లు రాహుల్ గాంధీ చెప్పారు. అదేవిధంగా.. పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేశారని ఆరోపించారు. అయితే.. మా విచారణలో ఆమె ఒక్కసారే ఓటు వేశానని చెప్పారు. ఆమె రెండుసార్లు ఓటేశారంటూ ప్రజెంటేషన్‌లో చూపిన టిక్ మార్క్ పత్రాలు కూడా పోలింగ్ అధికారి జారీ చేసినవి కావని వెల్లడైంది. కాబట్టి, ఆరోపణలకు సంబంధించిన పత్రాలను అందించండి. తద్వారా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టొచ్చు" అని రాహుల్ గాంధీకి జారీ చేసిన నోటీసులో కర్ణాటక సీఈవో పేర్కొన్నారు. ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆదివారం మరోసారి ధ్వజమెత్తారు. 'ఒక వ్యక్తి- ఒకే ఓటు' అనే ప్రజాస్వామ్య సూత్రంపై దాడిగా దీన్ని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షపాత ఎన్నికల నిర్వహణకు సరైన ఓటర్ల జాబితా తప్పనిసరి అని ట్వీట్ చేశారు. ప్రజలు, పార్టీలు ఆ జాబితాలను పరిశీలించేందుకు వీలుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్లకు సంబంధించిన ముసాయిదా, తుది జాబితాల డిజిటల్, ఫిజికల్ కాపీలను రాజకీయ పార్టీలకు అందజేస్తూనే ఉంటామని స్పష్టం చేసింది. పార్టీలకు ఓటర్ల జాబితా డిజిటల్ కాపీలను ఇవ్వరనే వాదనను అవాస్తవంగా, తప్పుదోవ పట్టించేదిగా ఈసీ పేర్కొంది.

## ఆపరేషన్ సిందూర్‌తో
# భారత్ అరుదైన రికార్డ్



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌పై భారత్.. క్రికెట్‌లోనే కాదు, యుద్ధంలోనూ రికార్డులను బద్దలు కొట్టింది. దీంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆపరేషన్ సిందూర్‌తో ఓ సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు వాయుసేన చీఫ్ ప్రకటించారు. తాము పాక్ గగనతలంలోని ఐదు ఫైటర్ జెట్‌లు, ఓ భారీ విమానాన్ని కూల్చేశామన్నారు. దీనిలో ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు ప్రకటించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఇంత దూరం నుంచి ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించలేదు. అంతకు ముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే అత్యధికం. 2024 ఫిబ్రవరిలో రష్యాకు చెందిన ఏ-50 నిఘా విమానాన్ని ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ 200 కిలోమీటర్ల దూరం నుంచి కూల్చేసింది. ఈ విషయాన్ని బీబీసీ కథనంలో పేర్కొంది. రొస్టోవ్ ఆన్ డాన్, క్రస్నడోర్ మధ్య ఈ దాడి జరిగింది. ఆపరేషన్ సిందూర్‌లో 300 కిలోమీటర్ల లక్ష్యం దీనిని బద్దలు కొట్టినట్లైంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ సు-27 యుద్ధ విమానాన్ని రష్యాకు చెందిన ఎస్-400 గగనతల వ్యవస్థ 150 కిలోమీటర్ల దూరంలో పేల్చేసింది.

### దీనికి ఎదుకింత ప్రాధాన్యం..

సుదీర్ఘ గగనతల లక్ష్యాలను ఛేదించడం అంత సులువైన విషయం కాదు. చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఇక 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలంటే.. అత్యంత కచ్చితత్వంతో పనిచేసే బియాండ్ విజువల్ రేంజి ఆయుధాలు అవసరం. రష్యా నుంచి భారత్ కొత్తగా కొనుగోలు చేసిన ఎస్-400 గగనతల వ్యవస్థలో ఇలాంటి ఆయుధాలున్నాయి. దీంతో పాటు వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు. దీనిని ఆపరేషన్ సిందూర్‌లో వాయుసేన పూర్తి స్థాయిలో వాడుకొంది. ఇంత దూరం నుంచి లక్ష్యాలను ఛేదించడంతోనే.. భారత్‌పై పాక్ యుద్ధ విమానాలు గైడెడ్ బాంబులను ప్రయోగించగలిగేంత సమీపానికి కూడా వచ్చేందుకు సాహసించలేదని భావిస్తున్నారు.

### ఏమిటీ ఎస్-400?

ఇది సంచార క్షిపణి వ్యవస్థ. రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివృద్ధి చేసింది. గతంలో ఉన్న ఎస్-300ను ఆధునికీకరించి.. దీన్ని రూపొందించింది. ప్రస్తుతం మరింత మెరుగైన ఎస్-500 గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ప్రత్యర్థి జామింగ్ విధానాలను ఎస్-400 తట్టుకోగలదు. ఇది యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో నేలకూల్చగలదు. మొత్తం ఐదు క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు భారత్.. 2018లో రష్యాతో 543 కోట్ల డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో మూడు వ్యవస్థలు ఇప్పటికే భారత్ చేరాయి. మిగతావి వచ్చే ఏడాది ఆగస్టులో అందే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ వేళ పంజాబ్, రాజస్థాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఎస్-400 వ్యవస్థలను మోహరించినట్లు తెలుస్తోంది. చైనా నుంచి రక్షణ కోసం అరుణాచల్ ప్రదేశ్ లేదా అస్సాంలో ఒక వ్యవస్థను రంగంలోకి దించి ఉంటారని అంచనా.

## అడవి తల్లి బాట గురించి
# గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి
### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి:** గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' పేరిట చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రెండు వారాలకోసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో పవన్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం జన్ మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. 'అడవి తల్లి బాట' పేరుతో రెండు దశల్లో చేపట్టిన పనుల్లో స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పవన్‌కు అధికారులు తెలిపారు. ఈ పనుల పురోగతిని వివరిస్తూ పనులు వేగంగా చేయడానికి ఎదురవుతున్న సవాళ్లను, అవరోధాలను వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను అనుసంధానిస్తూ కొత్త రోడ్డు రూపకల్పన చేసేందుకు బండరాళ్లను బద్దలు కొడుతూ ముందుకు వెళ్లేందుకు అధిక సమయం పడుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ ఉండటంతో పనుల వేగం తగ్గిందన్నారు. 128 రోడ్లు.. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండడం వల్ల అటవీశాఖ అనుమతులు కోరగా ఇప్పటికే 98 రోడ్లకు వచ్చాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 186 పనులు చేపట్టగా, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నట్టు అధికారులు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన ఈ పనుల గురించి స్థానికులకు కూడా తెలియజేయడం ఎంతో అవసరమని పవన్ అన్నారు. డోలీరహిత ఆవాసాలు ఉండాలనే సంకల్పంతో చేపట్టిన విషయాన్ని వారికీ చెప్పాలని తద్వారా వారి సహకారం, ప్రోత్సాహం కూడా లభిస్తుందని చెప్పారు.



## జన్‌ధన్ ఖాతాల
# రీ-కేవైసీకి డెడ్‌లైన్
### ఆన్‌లైన్‌లో చేసుకోండిలా

జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని, పెద్ద సంఖ్యలో ఖాతాలకు రీ-కేవైసీ చేయాల్సి ఉందని తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రీకేవైసీకి సెప్టెంబర్ 30 వరకు గడువు ఉందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వరంగ బ్యాంకులు పంచాయతీ స్థాయిలో రీ-కేవైసీ క్యాంపులు నిర్వహిస్తున్నాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ క్యాంపుల్లో రీ-కేవైసీతో పాటు మైక్రో ఇన్సూరెన్స్, పెన్షన్ పథకాలపై కూడా దృష్టి సారిస్తారని తెలిపారు. ఇంతకీ రీకేవైసీ అంటే ఏమిటి? ఆన్‌లైన్‌లో చేసుకునే వీలుందా?

### రీ-కేవైసీ అంటే ఏమిటి?

రీ-కేవైసీ అనేది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా తదితరాలను నవీకరించే ప్రక్రియ. మీ కేవైసీ గడువు తేదీ ముగిసినా లేదా మీకు సంబంధించిన వివరాలు మారినా.. నిబంధనల ప్రకారం బ్యాంక్‌కు తాజా సమాచారం సమర్పించాల్సి ఉంటుంది. జన్‌ధన్ ఖాతాలు తెరిచి 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు రీకేవైసీ ప్రక్రియ చేపడుతున్నారు. ఆయా క్యాంపుల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ రీకైవైసీ పూర్తి చేయొచ్చు.

### ఎస్‌బీఐలో ఇలా..

ప్రభుత్వరంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐలోనే పెద్ద సంఖ్యలో జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. ఒకవేళ ఈ బ్యాంక్‌లో జన్‌ధన్ ఖాతా ఉంటే ఆన్‌లైన్‌లోనూ రీ-కేవైసీ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం తొలుత ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అక్కడ 'My Accounts & Profile tab' పై క్లిక్ చేసి అప్‌డేట్ కేవైసీని సెలెక్ట్ చేయండి. తర్వాత మీ ప్రొఫైల్ పాస్‌వర్డ్ ఎంటర్ చేసి సబ్మిట్ నొక్కండి. మెనూ నుంచి మీ ఖాతా ఎంచుకుని సబ్మిట్ చేయండి. అక్కడ మీ వివరాలు నమోదు చేసి, ఒకవేళ మీరేమైనా డాక్యుమెంట్స్ అప్‌డేట్ చేయాల్సివుంటే వాటిని కూడా అప్‌లోడ్ చేయండి. తర్వాత ఓటీపీ ఎంటర్ చేయడంతో మీ కేవైసీ పూర్తవుతుంది. మీరు ఇంతకుముందు సమర్పించిన పత్రాలకు, అప్‌డేట్ చేసిన డాక్యుమెంట్స్‌కు వ్యత్యాసం ఉంటే బ్యాంకును సంప్రదించండి. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే తరహా ప్రక్రియ ఉంటుంది.

### ఏమిటీ జన్‌ధన్ ఖాతాలు?

2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస మొత్తం డిపాజిట్ లేకుండానే నిర్వహించుకోవచ్చు. చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి.




# విరాట్ - రోహిత్‌కు ఛాన్స్..
## ఆ ఒక్క కండీషన్‌కు ఓకే అంటేనే

వన్డే ప్రపంచ కప్ టోర్నీకి ఇంకా రెండేళ్ల సమయం ఉంది. కానీ, ఓ ఇద్దరి ఎంపికపై ఇప్పట్నుంచే చర్చ మొదలైంది. ఎందుకంటే వారిద్దరూ టీ20, టెస్టులకు వీడ్కోలు పలికి.. కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు బీసీసీఐ షరతులకు అంగీకరించకపోతే మాత్రం వన్డే ఫార్మాట్‌కూ రిటైర్‌మెంట్ తీసుకునే అవకాశం ఉందనేది క్రికెట్ వర్గాల మాట. ఆ ఇద్దరే టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ. 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీ ఆడాలంటే.. అప్పటి వరకూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంతోపాటు ఫామ్‌లోనూ ఉండటం చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో వారిద్దరినీ ఎంపిక చేయాలంటే బీసీసీఐ ఓ కండీషన్ పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. దేశవాళీ వన్డే ఫార్మాట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ.. ఈ ఏడాది డిసెంబర్ నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచుల్లో వారిద్దరూ పాల్గొంటేనే వన్డే ప్రపంచ కప్ స్క్వాడ్ కోసం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉంది. అందులో ఆడకపోతే దారులు దాదాపు మూసుకుపోయినట్లే. కొత్త జట్టు తయారు చేసుకునేందుకే గంభీర్ మొగ్గు చూపిస్తాడు. ఇప్పటికే టెస్టుల విషయంలోనూ ఇదే జరిగింది. కొత్త డబ్ల్యూటీసీ సీజన్‌లో గిల్‌కు సారథ్యం ఇవ్వడం వెనుక ప్రధాన కారణమదే. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడదామని తొలుత రోహిత్, కోహ్లీ భావించారు. కానీ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎంపిక చేయడం కష్టమేనని బీసీసీఐ వర్గాలు చెప్పడంతోనే వారు టెస్టులకు వీడ్కోలు పలికారనేది కాదనలేని వాస్తవం.

### ఆసీస్‌తో వన్డే సిరీస్..

రోహిత్, విరాట్ భవితవ్యం ఏంటో మరో రెండు నెలల్లో వచ్చే ఆస్ట్రేలియా సిరీస్‌తో తేలనుంది. ఆసీస్‌తో వన్డేలను టీమ్‌ఇండియా ఆడనుంది. ఇప్పటికే విరాట్ కోహ్లీ లండన్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టినట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్‌గా మారాయి. రోహిత్ పరిస్థితిపై సమాచారం లేదు. ఇంగ్లాండ్ - భారత్ వేదికగా జరిగిన ఓవల్ టెస్టు సమయంలో రోహిత్ అక్కడ కనిపించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీమ్‌ఇండియాకు వన్డే సారథిగా రోహిత్ శర్మనే ఉన్నాడు. ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీని రోహిత్ సారథ్యంలోనే టీమ్‌ఇండియా నెగ్గింది. ఆసీస్‌తో వన్డే సిరీస్ కోసం రోహిత్, కోహ్లీని ఎంపిక చేయడంపైనా సందేహాలు ఉన్నాయి. శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్ చేస్తారా? రోహిత్‌నే కొనసాగిస్తారా? తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# బుమ్రాకి సర్జరీ అయింది..
# అవేం మాటలు
### విమర్శకులపై మాజీ కోచ్ ఫైర్




"ఆ పేసర్‌కే ఎందుకు వర్క్‌లోడ్ అవుతుంది? మిగతా వారు క్రికెటర్లు కాదా..? అతడికే స్పెషల్ ట్రీట్‌మెంట్ ఎందుకు అవసరం?.. ఇవీ ఇంగ్లాండ్‌తో సిరీస్ సందర్భంగా జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో వచ్చిన కామెంట్లు. ఐదు టెస్టుల్లో కేవలం మూడింట్లోనే ఆడతానన్న బుమ్రాకు బీసీసీఐ ఎలా అనుమతి ఇచ్చిందనే విమర్శలూ వచ్చాయి. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో కీలకంగా మారిన ఐదో టెస్టు ముందు అతడిని టెస్టు జట్టు నుంచి రిలీజ్ చేయడంపైనా అభిమానుల్లో అసహనం కలిగింది. అయితే, వీటిపై భారత మాజీ కోచ్ భరత్ అరుణ్ తీవ్రంగా స్పందించాడు. బుమ్రాను చాలా దగ్గర నుంచి చూసిన వారిలో అతడొకరు. "బుమ్రా విషయంలో ఇలాంటి విమర్శలు చాలా బాధాకరం. అతడికి గతంలో సర్జరీ జరిగింది. అయినా సరే జట్టు కోసం కష్టపడి వచ్చిన తీరును అభిమానులు అర్థం చేసుకోవాలి. ఇప్పటికీ అతడి వెన్నుకు సంబంధించి పెద్ద సమస్యతోనే బాధపడుతున్నాడు. గత కొద్ది నెలల కిందటే ఆసీస్ వేదికగా జరిగిన టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించి అత్యుత్తమ బౌలర్ అనిపించుకున్నాడు. ఇప్పుడు మాత్రం విమర్శలు చేయడం సమంజసం కాదు. ఏ టెస్టులో ఆడాలి?ఏది ఆడకూడదు? అనేది అతడు ఎంచుకోలేదు. మూడు టెస్టుల్లోనూ అతడేమన్నా పేలవమైన ప్రదర్శన చేశాడా?అదేం లేదుగా. రెండుసార్లు ఫైఫర్ (5 వికెట్లు) తీశాడు. దాదాపు 120 ఓవర్లపాటు బౌలింగ్ చేశాడు. 14 వికెట్లూ తీశాడు" అని అరుణ్ వెల్లడించాడు.

### ముందే ఎందుకు ప్రకటించారంటే?

"ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు చాలా ముందే బుమ్రా కేవలం మూడు టెస్టుల్లోనే ఆడతాడు అని ఎందుకు ప్రకటించారని మీరు (విమర్శకులు) అనుకుంటున్నారు? ఇలాంటి చెత్త వ్యాఖ్యలు రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రకటించారు. ప్రతి టెస్టు మ్యాచ్ కూడా కీలకమే. అయితే, అతడి శరీరం దానికి సహకరించాల్సి ఉంటుంది. టెస్టుల్లో ఆడటం ఎంత కష్టమో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అందుకోసం బుమ్రా శ్రమను ఇక్కడ అభినందించాల్సిన అవసరం ఉంది" అని భరత్ అరుణ్ వ్యాఖ్యానించాడు.

## మ్యాచ్ రాత్రి 7 గంటలకైతే..
# సాయంత్రం 5 గంటల వరకూ నిద్రే: సంజు




రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా సంజు శాంసన్ గత నాలుగు సీజన్ల నుంచి ఉన్నాడు. గత ఎడిషన్‌లో దారుణమైన ప్రదర్శనతో ఆర్ఆర్ పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, జట్టుకు సారథ్యం వహించడంపై రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానల్‌లో సంజు ఆసక్తికర విశేషాలను వెల్లడించాడు. కెప్టెన్‌గా తన దృక్కోణం చాలా మారిపోయిందని వెల్లడించాడు. తన సహచరుడు షిమ్రోన్ హెట్‌మయెర్ నిద్ర గురించీ సరదా కామెంట్లు చేశాడు. "సారథ్యం చేపట్టాక నా ఆలోచనా తీరు చాలా మారింది. ఏదైనా అంశాన్ని చూసే విధానంలోనూ మార్పు వచ్చింది. కొన్నింటిని అంగీకరించే మనస్తత్వమూ అలవడింది. క్రికెట్‌లో విజయం సాధించాలంటే ఒకటే మార్గం ఉందని నేను నమ్మను. అసలు అలాంటేదేమీ లేదు. భిన్నంగా ప్రయత్నించి సక్సెస్ అవుతారు. అలాంటి వారిని ప్రశ్నించడం కంటే వెనకుండి ప్రోత్సహించడం నాకు ఇష్టం. నేను సారథి కాకముందు ప్లేయర్‌ను మాత్రమే. అప్పుడు నేను కేవలం నేను ఎలా ఆడాలనే దాని గురించి ఆలోచించేవాడిని. ప్రాక్టీస్ చేయడంపై, మ్యాచ్‌లో బ్యాటింగ్‌పైనే దృష్టిపెట్టేవాడిని" అని సంజు వెల్లడించాడు.

### మీటింగ్‌ల్లోనూ అతడు అంతే..

విండీస్ ఆటగాడు షిమ్రోన్ హెట్‌మయెర్ భారీ హిట్టర్. బంతిని బలంగా బాదేయడంలో స్పెషలిస్ట్. మరి అలాంటి క్రికెటర్ రొటీన్ లైఫ్ ఎలా ఉంటుందో? అనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. సంజు మాత్రం హెట్‌మయెర్ ఎక్కువగా నిద్రపోతూనే ఉంటాడని వ్యాఖ్యానించాడు. "మ్యాచ్ రాత్రి 7 గంటలకు ఉంటే.. హెట్‌మయెర్ మాత్రం సాయంత్రం 5 గంటల వరకు నిద్రపోతాడు. టీమ్ మీటింగ్స్ సమయంలోనూ అతడు నిద్రలోనే ఉంటాడు. కానీ, క్రీజ్‌లోకి దిగాక కీలకమైన పరుగులు చేస్తుంటాడు. మ్యాచ్‌లను గెలిపిస్తాడు. సక్సెస్ కావడానికి అదొక మార్గం అయి ఉండొచ్చు" అని సంజు వెల్లడించాడు.

# అదేంటి కోహ్లీ నుంచి ఫోన్? అభిమానికి కలిసొచ్చిన 'సిమ్' కార్డు



కొత్తగా సిమ్ కార్డు తీసుకున్న ఓ వ్యక్తికి.. విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్, యశ్ దయాళ్‌తో సహా ఇతర రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు చెందిన ఆటగాళ్ల నుంచి ఫోన్లు వచ్చాయి. మరి అతడేమన్నా ఆర్సీబీ మేనేజరా? లేకపోతే క్రికెట్ ప్లేయరా? అని సందేహం రావడం సహజమే. కానీ, ఆ స్టార్ క్రికెటర్లకు సదరు వ్యక్తి అస్సలు తెలియదు. అతడికి మాత్రం వారి నుంచి ఫోన్లు వచ్చాయనే వార్తలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి అసలేం జరిగిందంటే? ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ జిల్లాలోని మడగావ్‌కు చెందిన 21 ఏళ్ల మనీశ్ బిసి దేవ్‌భోగ్‌లో కొత్త సిమ్ కార్డు తీసుకున్నాడు. తన స్నేహితుడు ఖేమ్‌రాజ్ సహకారంతో వాట్సప్‌ను క్రియేట్ చేస్తున్నప్పుడు ప్రొఫైల్ ఇమేజ్‌గా రజత్ పాటీదార్ కనిపించాడు. అయితే, ఇదంతా మామూలుగానే వచ్చి ఉంటుందనే ఉద్దేశంతో పట్టించుకోలేదు. కానీ విరాట్ కోహ్లీ , ఏబీ డివిలియర్స్, యశ్ దయాళ్, ఇతర ఆర్సీబీ ఆటగాళ్లుగా చెబుతూ ఫోన్లు రావడం మొదలయ్యాయని మనీశ్ వెల్లడించారు. ఇలా రెండు వారాలు గడిచిపోయాయి. ఇదిలా ఉండగా తన వాట్సప్ ఖాతాను యాక్సెస్ చేయలేకపోతున్నానని గ్రహించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటీదార్ మధ్యప్రదేశ్ సైబర్ సెల్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన విచారణ అధికారులు వెంటనే మనీశ్ వద్ద ఆ వాట్సాప్ నంబర్ ఉందని గుర్తించారు. టెలికాం కంపెనీ పునఃకేటాయింపు పాలసీ ప్రకారం మనీశ్‌కు ఈ నంబర్‌ను ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. రజత్ - మనీశ్ సిమ్ కార్డు వ్యవహారంపై గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా స్పందించారు. "ఏదైనా నంబర్ ఆరునెలలపాటు యాక్టివ్‌లో లేకపోతే.. ఆ సిమ్‌ను టెలికాం కంపెనీలు మరొక కస్టమర్‌కు కేటాయిస్తూ ఉంటాయి. ఈ కేసులోనూ అదే జరిగింది. ఇప్పుడు రజత్‌కు మళ్లీ ఆ సిమ్‌ను రిటర్న్ చేస్తాం" అని వెల్లడించారు. మనీశ్‌తోపాటు అతడి స్నేహితుడు ఖేమ్‌రాజ్ కూడా క్రికెట్‌కు వీరాభిమానులు. దీంతో తమ అభిమాన క్రికెటర్ల నుంచి ఫోన్లు రావడంతో షాక్‌తోపాటు సంతోషపడటం గమనార్హం.

## రష్యా చమురు లేకపోయినా
# భారతీయ రిఫైనరీలు పని చేయగలవు

**ఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద రష్యా చమురు వినియోగదారు అయిన భారతీయ శుద్ధి కర్మాగారాలు సాంకేతికంగా మాస్కో నుంచి సరఫరా లేకుండా పని చేయగలవని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురు ధర తక్కువగా ఉండటంతో, రిఫైనరీలకు అధిక మార్జిన్ ఉండే అవకాశం ఉందని గ్లోబల్ రియల్-టైమ్ డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత వారం భారత్ నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అదనంగా మరో 25 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి వద్దన్నా భారత్, చమురు దిగుమతి చేసుకుంటోందన్న కారణంతో టారిఫ్‌ను 50 శాతానికి పెంచారు. అధిక సుంకాలు మన దేశం అమెరికాకు చేసే 27 బిలియన్ డాలర్ల మినహాయింపు లేని ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉన్నందున, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడం లేదా తగ్గించడం గురించి చర్చ జరుగుతోంది.

### చమురు వాటా 1.7% నుంచి 35.1 శాతానికి..

2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దాడి చేసినందుకు పాశ్చాత్య దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించి, దాని చమురు సరఫరాలను ఆపేశాయి. మన దేశం మాత్రం తక్కువ (డిస్కౌంట్) ధరకు రష్యా చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. 2019-20లో మన దేశం మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 35.1 శాతానికి పెరిగింది. ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా ఉంది. పరిమాణం పరంగా, మన దేశం 2024-25లో రష్యా నుంచి 88 మిలియన్ టన్నుల చమురును దిగుమతి చేసుకుంది. గత నెలలో అయితే రోజుకు 1.6 మిలియన్ బ్యారెల్ల ముడి చమురును మన దేశం దిగుమతి చేసుకుంది. చైనా 1 మిలియన్ బ్యారెళ్లు, తుర్కియే 5 లక్షల బ్యారెళ్ల ముడిచమురును అందుకున్నాయి.

### భారత్ ఆలోచించి అడుగేయాలి

ట్రంప్ భారతీయ వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాన్ని ప్రకటించిన తర్వాత, రష్యా నుంచి చౌకగా దిగుమతి చేసుకునే చమురు 'విలువైనదేనా' అని భారత్ ఆలోచించాలని నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ తెలిపారు. అదనపు సుంకం 25 శాతం ఈ నెల 27 నుంచి అమల్లోకి రాబోతున్నందున, రష్యా చమురు దిగుమతులు మనకు అనుకూలంగా ఉంటాయా? లేదా? అనేది ఆలోచించి ఒకవేళ రష్యా నుంచి దిగుమతులు ఆపివేస్తే టారిఫ్‌లు తగ్గిస్తారేమో అమెరికాను అడగొచ్చని బీఎంఎల్ ముంజాల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అభిజిత్ వెల్లడించారు.





# తక్కువ ఆదాయం గలవారు డబ్బు ఆదా చేయడం ఎలా?

చాలా మంది డబ్బు సంపాదన తర్వాత ఆదా చేయడం గురించి తమ ప్రయత్నాలు చేస్తారు. కొంత మంది చొరవ గలవారు ఎంత డబ్బు సంపాదించినా తక్కువ మెంత్తంలోనైనా ఆదా చేయడానికి తమ వంతు కృషి చేస్తుంటారు. అధిక ఆదాయం సంపాదించేవారికి, డబ్బు ఆదా చేయడం అంత పెద్ద కష్టం కాకపోవచ్చు. కొందరికి అనుకున్నంత ఆదాయం ఉండదు. అటువంటప్పుడు ఆదా చేయడం వారికి సవాలుగానే అనిపిస్తుంది. కానీ, సరైన దూరదృష్టితో మెరుగైన విధానాలను అనుసరిస్తే ఇది సాధ్యమే అంటున్నారు నిపుణులు.

## బడ్జెట్

మీ ఆదాయం తక్కువగా ఉన్నప్పుడు, డబ్బు ఆదా చేయడానికి మీరు తీసుకోవలసిన ప్రాథమిక అంశాలలో పొదుపు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఒకటి. మీరు పొదుపు లక్ష్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు, డబ్బు ఆదా చేయడం సులభం అవుతుంది. ఖర్చులను తగ్గించగల విషయాలను గుర్తించడానికి మీ ఆదాయం, ఖర్చులను ట్రాక్ చేయడం చాలా అవసరం. మీ ఆదాయ స్థాయితో సంబంధం లేకుండా నెలలో మొదటి రోజే బడ్జెట్‌ను సెట్ చేసుకుని దానికి కట్టుబడి ఉండండి. ఇది మీరు కిరాణా సామగ్రి, వ్యక్తిగత సంరక్షణ, బిల్లులు మొదలైన వాటిపై పరిమిత మొత్తాన్ని ఖర్చు చేయడానికి సహాయపడుతుంది.

## షేర్ చేసుకోండి

ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా మందితో పోలిస్తే, ఇక్కడ ఒక వ్యక్తి.. తన నెలవారీ ఆహారం, ఇంటి అద్దె కోసం చేసే ఖర్చు సగటున ఎక్కువగానే ఉంటుంది. మీరు బ్యాచిలర్ అయితే, అద్దె ఇంటికి ఒకరికి బదులుగా ఇంకొక రూం మేట్‌ను తీసుకోండి. కలిసి ఉండడం, కలిసి వంట చేసుకోవడం లాంటి చర్యలు వల్ల డబ్బు, సమయం చాలా ఆదా అవుతాయి. మీరు అన్ని ముఖ్యమైన ఖర్చులను కవర్ చేసిన తర్వాత, సంపాదనలో కొంత భాగాన్ని పొదుపుగా పక్కన పెట్టండి. క్రమంగా మీ పొదుపును ఆదాయంలో 10% నుంచి 30% వరకు పెంచుకోండి.

## కొనుగోళ్లు, సేవలు

తెలివిగా ఖర్చు చేసే అలవాటును పెంపొందించుకోవడానికి అనవసరమైన ఖర్చులను తగ్గించుకోండి. ప్రతి వస్తువును కొత్తది కొనడానికి బదులుగా వాటిని అద్దెకు తీసుకోవచ్చు. లేదా సెకండ్ హ్యాండ్ వస్తువులను కొనండి. ప్రస్తుతం, తక్కువ ధరలకు వస్తువులను అందించే అనేక యాప్‌లు, అమ్మకాల సైట్‌లు ఉన్నాయి. వాటిని గుర్తించి, మంచి నాణ్యతతో కూడిన చౌకైన వస్తువులను ఎంచుకోండి. ఇది కాకుండా, మీకు ఇకపై అవసరం లేని సభ్యత్వాలు, సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను రద్దు చేయండి. ఇందులో జిమ్ సభ్యత్వం, స్ట్రీమింగ్ సేవలు, ఆన్‌లైన్ సభ్యత్వాలు వంటివి ఉండొచ్చు. వాటిని రద్దు చేయడం వల్ల మీరు డబ్బు ఆదా చేసుకుని పొదుపు లక్ష్యాన్ని పెంచుకోవచ్చు.

## ప్రయాణ ఖర్చులు

ప్రస్తుతం చాలా మందికి ప్రయాణాల ఖర్చులు చాలా భారమవుతుంటాయి. కాబట్టి, సాధ్యమైనంత వరకు తక్కువ దూర ప్రయాణానికి వ్యక్తిగత వాహనాన్ని ఉపయోగించండి. దూరపు ప్రాంతాలకు ప్రజా రవాణాను ఉపయోగించండి. ఇంకా మీ సహోద్యోగి మీ ఇంటి వద్దే నివాసం ఉంటుంటే ఇద్దరూ కలిసి ఒక వాహనం మీద వెళ్లి, ఖర్చులు షేర్ చేసుకోవచ్చు. మీకు సొంతంగా వాహనం లేకపోయినా సరే, ప్రస్తుతం వివిధ అప్లికేషన్స్.. చౌకైన ప్రయాణ ఎంపికలను, షేర్డ్ రైడ్‌లను అందిస్తున్నాయి. ఇలాంటి వాటిని ఉపయోగించుకోవడం వల్ల డబ్బు చాలా వరకు ఆదా చేసుకోవచ్చు. ఇంకా మీరు విహార యాత్రలు, పుణ్య క్షేత్రాల సందర్శన వంటివి చేయాలనుకున్నప్పుడు బృందంగా ఏర్పడి వెళ్లడం మేలు. దీనివల్ల ఖర్చులు చాలా వరకు తగ్గి డబ్బు ఆదా చేసుకోవచ్చు.





## బీమా

మీ కుటుంబానికి ఆరోగ్య బీమా, జీవిత బీమా లాంటి కవరేజీలతో రక్షణ కల్పించండి. బీమా పాలసీ తీసుకోవడం కూడా ముందస్తు ఆదా లాంటిదే. ఎందుకంటే, మీ ఆదాయం తక్కువ ఉన్నప్పుడు అనారోగ్యాలు కూడా తోడైతే అది మరింత ఖర్చు. తక్కువ ఆదాయం ఉన్న మీరు ఆసుపత్రి చికిత్సలకు అప్పులు చేయడం, మళ్లీ వాటిని తీర్చడం లాంటి విషయాలు మరింత ఇబ్బంది పెడతాయి. అందుచేత, మీరు ఆరోగ్య బీమా పాలసీని ముందుగానే కలిగి ఉంటే, మీకు మీ కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్యం విషయంలో భరోసా లభిస్తుంది. అధిక మెంత్తంలో చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టకుండానే వైద్య చికిత్సలు చేయించుకుని ఖర్చుల నుంచి తప్పించుకోవచ్చు. అంతే కాకుండా ప్రతి కుటుంబంలోని సంపాదించే వ్యక్తికి టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కూడా చాలా అవసరం. ఇది దురదృష్టకరమైన పరిస్థితుల్లో కుటుంబ యజమాని మరణించినప్పుడు మిగిలిన కుటుంబానికి ఎంతో ఆర్థిక భరోసానిస్తుంది. ముఖ్యంగా ఇది తక్కువ ఆదాయం గల కుటుంబాలకు సంపూర్ణ ఆర్థిక ప్రయోజనాన్నిస్తుంది. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రీమియం చాలా సరసమైంది. ఇది తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులకు కూడా చాలా అనువైంది.

## ఆటోమేట్ సేవింగ్స్

మీరు జీతం అందుకున్న వెంటనే రికరింగ్ డిపాజిట్, మ్యూచువల్ ఫండ్లు వంటి వివిధ పెట్టుబడి పథకాలకు ఆటోమేటిక్‌గా బ్యాంకు నుంచి డబ్బు బదిలీ అయ్యేటట్టుగా ముందుగానే మాండేట్ ఇవ్వడం మంచిది. మ్యూచువల్ ఫండ్లలో నెలవారీ %బాక్రూ% లేదా రికరింగ్ డిపాజిట్లు వంటి పొదుపు పథకాలను ఎంచుకోవడం వల్ల మీరు ప్రతి నెలా రూ.100తో కూడా డబ్బు ఆదా చేయడం ప్రారంభించవచ్చు. తక్కువ ఆదాయం గలవారు ఇటువంటి వ్యూహాలను అమలు చేయడం వల్ల మీరు ప్రతి నెలా డబ్బు ఆదా చేసి భవిష్యత్తు లేదా అత్యవసర ఉపయోగం కోసం ఒక నిధిని సమకూర్చుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు ల ద్వారా, మీరు స్టాక్స్, బాండ్లు, బంగారం మొదలైన వాటిలో చిన్న మొత్తాలను కూడా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తిగా, మీరులో ఒక షేరును కొనుగోలు చేయడం ద్వారా చిన్న మొత్తంతో సేవింగ్స్‌ను ప్రారంభించవచ్చు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# సోషల్ మీడియా వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను

**- మాళవిక మోహనన్ ఆసక్తికర కామెంట్స్**

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ 'ది రాజాసాబ్' సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తోంది. ప్రభాస్, మారుతి కాంబోలో రాబోతున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, మాళవిక న్యూఢిల్లీలో జరిగిన న్యూస్ ఎక్స్ వి ఉమెన్ వాంట్ కాన్క్లేవ్, శక్తి అవార్డ్స్ వేడుకల్లో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేసింది. "సినీ ఇండస్ట్రీలో రచయితలకు తగిన రెమ్యునరేషన్ ఇవ్వకుండా మంచి సినిమాలను ఆశించలేం. హిందీ చిత్ర పరిశ్రమ రచయితలకు తగిన ప్రాముఖ్యత ఇవ్వడం లేదని నేను నమ్ముతున్నాను. అందుకే గత కొద్ది కాలంగా మంచి స్క్రిప్టులు రావట్లేదు. ప్రస్తుతం సోషల్ మీడియా చాలా ముఖ్యమైన సాధనంగా మారింది. నా కెరీర్ ప్రారంభ సంవత్సరాల్లో, సోషల్ మీడియా నాకు పాత్రలు సంపాదించడానికి సహాయపడింది. నేను ఆన్‌లైన్‌లో చేసిన ఫోటోషూట్ చూసిన తర్వాత ఒక దర్శకుడు నన్ను ఎంపిక చేసుకున్నాడు. ఆ చిత్రం నా కెరీర్ ఊహించని విధంగా మారింది. ఇందులో నేను చేసిన పాత్ర భారతదేశం అంతటా దర్శకుల దృష్టిని ఆకర్షించింది. అనేక చిత్రాలలో నటించడానికి నాకు సహాయపడింది. నటిగా ఉండటానికి ఇది గొప్ప సమయం అని నేను భావిస్తున్నాను. మంచి పని ప్రతిచోటా జరుగుతోంది. భాష ఇకపై అడ్డంకి కాదు. ఇది మంచి సినిమా అయితే, భారతదేశం అంతటా ప్రజలు ఆదరిస్తారు" అని చెప్పుకొచ్చింది.





## శారీలో స్టార్ బ్యూటీ అందాలు

అతిలోక సుందరి తనయురాలు, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి స్పెషల్‌గా చెప్పనక్కర్లేదు. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన ఈ భామ తెలుగులో కొరటాల శివ దర్శకత్వంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' మూవీతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. తన ఫస్ట్ మూవీతోనే మంచి హిట్ సాధించింది. ప్రస్తుతం ఈ అమ్మడు 'పెద్ది' మూవీలో నటిస్తుంది. రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఇక ఈ చిత్రానికి ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఇక ఇందులో స్టార్ యాక్టర్ జగపతి బాబు, శివరాజ్ కుమార్ అలియాస్ శివన్న, దివ్యేందు వంటి ప్రముఖులు కీ రోల్ ప్లే చేస్తున్నారు. అయితే ఈ సినిమాను భారీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ చిన్నది లేటెస్ట్ ఫొటో షూట్స్, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందులో లిల్లీ పూలతో చేసిన శారీని కట్టుకొని పరమ్ సుందరి మూవీ ప్రమోషన్స్ స్టార్ట్ చేసింది. ఆ పువ్వులతో చేసిన చీరలో నడుము అందాలు,చెస్ట్ పార్ట్ కనిపించేలా ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. ఇక దీనికి 'పరమ్ సుందరి మూవీ 29న థియేటర్లలో రాబోతుంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు లుకింగ్ సో బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# ఏకాధి సిల్వర్ జ్యువెలరీని ప్రారంభించిన నిధి అగర్వాల్




ప్రముఖ నటి నిధి అగర్వాల్, ఎమ్మెల్యే రామాంజనేయులు (అంజి బాబు), తో పాటు ఏకాధి డైరెక్టర్ వేణు రాచకొండ కలిసి ఆదివారం భీమవరంలో ఏకాధి సిల్వర్ జ్యువెలరీ తమ నాలుగవ షోరూమ్‌ను ప్రారంభించారు. ఇది బ్రాండ్ యొక్క చక్కదనం మరియు వెండి హస్తకళలో అత్యుత్తమ ప్రయాణం లో కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. గ్రాండ్ ప్రారంభోత్సవ వేడుకలో నగల ప్రియులు, నటి అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తన ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్‌కు పేరుగాంచిన నిధి అగర్వాల్, సాంప్రదా య, పురాతన, సమకాలీన డిజైన్‌లతో సహా ఏకాధి యొక్క విస్తృత శ్రేణి సున్నితమైన వెండి ఆభరణాల సేకరణలను చూసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ, "వారసత్వం, హస్తకళను ప్రోత్సహించే వాటిలో భాగం కావడం ఎల్లప్పుడూ సంతోషాన్నిస్తుంది. ఏకాధి సిల్వర్ జ్యువెలరీ సంప్రదాయం ఆధునిక డిజైన్‌ల యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని అందిస్తోంది, ఇది వెండి ఆభరణాల ప్రియులందరికీ వన్-స్టాప్ గమ్యస్థానంగా మారుతుంది." వెండిలో బంగారం లాగా విలాసవంతంగా రూపొందించబడడంలో ఏకాది ప్రత్యేకం అన్నారు. "లాంచ్ ను పురస్కరించుకుని, ఏకాధి సిల్వర్ జ్యువెలరీ ప్రత్యేకమైన శ్రావణ మాసం పండుగ ఆఫర్‌లను అందిస్తోంది, ఇది పరి మిత కాలానికి చెల్లుబాటు అవుతుంది. కస్టమర్‌లు చేతితో తయారు చేసిన వెండి ఆభరణాలు, బహుమతి వస్తువులు, పూజా వస్తువులు మరియు మరిన్నింటిని ఆకర్షణీయమైన ధరలలో అన్వేషించవచ్చు. విలాసవంతమైన వెండి ఆభరణా లు, బంగారం వలె రూపొందించబడ్డాయి. సాంప్రదాయ బంగారు కళాకారులచే రూపొందించబడిన ప్రీమియం చేతితో తయారు చేసిన వెండి ఆభరణాలను ఏకాధి తీసుకువస్తుంది. అదే వైభవం, బంగారం వంటి వివరాలను అందిస్తూ, ఏకాధి యొక్క స్వచ్ఛమైన వెండి సేకరణలు వివాహాలు, పండుగ దుస్తులు మరియు రోజువారీ సొబగుల కోసం ఖచ్చితంగా సరిపోతాయి" అని ఫ్రాంఛైజర్ తాతవర్తి అఖిల్ అన్నారు.

## చర్మ రంగు ముఖ్యం కాదు.. ప్రతిభే ప్రధానం : ప్రియమణి

టాలీవుడ్ నటి ప్రియమణి గత ఏడాది మైదాన్, భామా కలాపం వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఈ అమ్మడు దళపతి విజయ్ 'జన నాయగన్' మూవీలో కీలక పాత్రలో కనిపించనుంది. హెచ్ వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా భారీ అంచనాల మధ్య రాబోతుంది. రాజకీయ యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. అయితే ప్రియమణి ఓ వైపు షూటింగ్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీగా ఉంటుంది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియమణి బాలీవుడ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. "బాలీవుడ్‌లో కొందమంది దర్శకులు నన్ను చూసి సౌత్ ఇండియన్ క్యారెక్టర్ ఉంది కాబట్టి మిమ్మల్ని తీసుకుంటున్నాము అని చెప్పారు. అప్పుడు నాకు చాలా బాధ అనిపించింది. మేము నిజంగానే దక్షిణాది వాళ్లం అయినా అన్ని భాషలు మాట్లాడగలం అని చెప్పాను. ఉత్తరాది నటీమణుల మాదిరిగా తెల్లగా ఉండకపోవచ్చు కానీ అందంగా ఉంటామని ధైర్యంగా చెప్పగలుగుతాము. చర్మ రంగు ముఖ్యం కాదు ప్రతిభే ప్రధానం. కానీ దురదృష్టవశాత్తు బాలీవుడ్‌లో ఇప్పటికీ పాత్రలు ఇస్తున్న నటీనటుల రంగు, ప్రాంతం వంటి విషయాలను పరిగణలోకి తీసుకుని అవకాశం ఇస్తున్నారు. నటనకు, ప్రతిభకు చర్మ రంగుతో, ప్రాంతంతో సంబంధం లేదని గుర్తిస్తే మంచిది" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ప్రియమణి కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com